
ఆంధ్రజ్యోతి
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 6 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.152	225	255
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 23.4



నేడు రాములోరి కళ్యాణం

ముస్తాబైన ఆలయాలు

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హిందువుల ఆరాధ్య దైవం సీతారాముడి కల్యాణోత్సవానికి జిల్లా ముస్తాబైంది. జిల్లాలోని అన్ని ఆలయాలల్లో ఆదివారం శ్రీరామనవమిని వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించి చలువ పందిళ్లు వేశారు. కల్యాణ వేడుకల అనంతరం అన్నదానం నిర్వహించనున్నారు. సాయంత్రం కల్యాణమూర్తులను ఊరేగించనున్నారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రం రామగిరి రామాలయంలో శ్రీరామనవమి వేడుకలకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సుగుణాభి రాముడు

- కుమారుడు, భర్త, అన్నగా నేటి తరానికి ఆదర్శం
- బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచిన పాలనాదక్షుడు ,ఏకపత్నీవ్రతుడు

●6లో..



మిర్యాలగూడలో రైస్ మిల్లుల ఎదుట బారులుతీరిన ధాన్యం ట్రాక్టర్లు

మిల్లర్ల మాయాజాలం



యాసంగిలో పండిన పంటకు మంచి ధర పలుకుతుందని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. ధాన్యం రాక పెరగడంతో మిల్లర్లు కనీస మద్దతుకు మంగళం పలికారు. ఇష్టం వచ్చిన ధర కు మిల్లర్లు కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధర అమాంతం తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వానాకాలంలో మిల్లర్లు చింట్లు, హెచ్‌ఎంటీలు, సన్న రకాలకు పచ్చిధాన్యానికి రూ.2,500 నుంచి రూ.2,800 వరకు కొనుగోలుచేశారు. యాసంగిలో క్వింటాకు రూ.2వేలు నుంచి రూ.2,250 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,హుజూర్‌నగర్,మిర్యాలగూడ వ్యవసాయం

- యాసంగిలో దిగుబడి పెరిగినా ధర తగ్గింది
- చింట్లు రకం కొనుగోలు, హెచ్‌ఎంటీలకు నో
- ఇదే అదునుగా ధర తగ్గించిన మిల్లర్లు
- తెరుచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- క్వింటాకు రూ.2వేల నుంచి రూ.2,250 చెల్లింపు
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు


యాసంగిలో సాగర్ ఆయకట్టులో సుమారు 6.50లక్షల ఎకరాల్లో వరి సాగైంది. వీటిలో 80శాతం మేర చింట్లు, హెచ్ఎంటీ వంటి అతి సన్న రకాలను సాగు చేశారు. ఐదేళ్లగా వరుసగా వానాకాలం, యాసంగిలో ఈ రకం సన్నాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వరి కోతల ప్రారంభ దశలో క్వింటాకు రూ.2,500 నుంచి రూ.2,700 వరకు ధర పలుకుతూ వచ్చింది. ప్రతీ సారి మద్దతుకు మించి ధర వస్తుండటంతో యాసంగిలో రైతులు సన్నాలను అధికంగా సాగు చేశారు. ఈఏడాది యాసంగిలో మార్చి 10నుంచే వరికోతలు ప్రారంభం కాగా, ప్రారంభంలో చింట్లు రకానికి రూ.2,400, హెచ్‌ఎంటీలకు రూ.2,250 చెల్లించిన వ్యాపారులు ప్రస్తుతం ధర తగ్గించారు. మిల్లులో భారీగా ధాన్యం నిల్వ ఉందని మిల్లర్లు కొనుగోలుకు ముందుకు రావడం లేదు.మద్దతు ధర రూ.2,320 కాగా, కేవలం చింట్లు రకానికి రూ.2,250 చెల్లిస్తున్నారు. హెచ్‌ఎంటీ రకాలను కొనుగోలు చేసే దిక్కు లేదు. మిర్యాలగూడ ప్రాంతంలో 150వరకు మిల్లులు ఉండగా, పదికి మించి మిల్లులు హెచ్‌ఎంటీ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. సన్నాల్లో అధికంగా హెచ్ ఎంటీ రకాలనే సాగు చేశా రు.ఒక ట్రాక్టర్ ధాన్యం విక్రయించేందుకు రెండు రోజు ల వరకు సమయం పడుతోందని రైతులు చెబుతున్నారు. అదికూడా క్వింటాకు రూ.2,000నుంచి రూ.2,1 00వరకు ధర చెల్లిస్తున్నారని, విధిలేని పరిస్థితుల్లో విక్రయించక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లర్ల సిండికేట్

సూర్యాపేట జిల్లా పరిధిలోని హుజూర్‌నగర్, కోదాడతో పాటు సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కోతలు ముమ్మరమయ్యాయి. వారం రోజుల నుంచి రైతులు పచ్చి ధాన్యాన్ని తీసుకువస్తుండగా, మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ఆయకట్టులోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో సుమారు 2.5లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఒక్క...

- మిగతా 7వ పేజీలో...

మిల్లర్లు యాసంగి ధర తగ్గించారు



మిల్లర్లు యాసంగిలో రైతులు ధర పూర్తిగా తగ్గించారు. పచ్చి ధాన్యాన్ని గత యాసంగిలో రూ.2,700 వరకు కొనుగోలు చేయగా, ఈ ఏడాది రూ.2,000లకే కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ.700 ధర తగ్గింది. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

- గుండు వెంకటేశ్వర్లు, హుజూర్‌నగర్ రైతు

తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు

యాసంగిలో సాగర్ ఆయకట్టులో పదిరోజుల నుంచే వరి నూర్పిడి చేస్తుండగా, సూర్యాపేట జిల్లాలో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. రెండు రోజుల క్రితం జిల్లా ఉన్నతాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 127, ఐకేపీ ఆధ్వర్యంలో 137, మొత్తం 286 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ, నేటికీ అవి తెరుచుకోలేదు. రెండు రోజులుగా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురవగా, ఆకాశంలో మబ్బులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చేసేది లేక పచ్చిధాన్యాన్ని తక్కువ ధరకే మిల్లర్లకు విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- మాజీ సీఎం కేసీఆర్ ▸ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలతో సమీక్ష



ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

నల్లగొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నేతలంతా కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కోరారు. శనివారం సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల బీఆర్ఎస్ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ విజయవంతంపై నేతలకు ఆయనపలు సూచనలు చేశారు. రజతోత్సవానికి పెద్ద సంఖ్యలో జనాన్ని తరలించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ముందస్తు గా నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశాలు నిర్వహించాలన్నారు. మండలాలు, గ్రామాలవారీగా ఎక్కడి నుంచి ఎంతమందిని సభకు తీసుకురావాలో నిర్ణయించుకోవాలని సూచించారు. సూర్యాపేట, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల నుంచి 10వేల మంది చొప్పున జనసమీకరణ చేయాలన్నారు. మిగిలిని నియోజకవర్గాల్లో 4వేల నుంచి 5వేల వరకు జన సమీకరణ చేయాలన్నారు. బస్సులు, ఇతర వాహనాలను ముందుగానే...

- మిగతా 6వ పేజీలో...

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఎల్లారెడ్డిగూడెంలో మేడి అరుణ ఇంట్లో ఎమ్మెల్యే వీరేశంతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయంలో హరిత విప్లవానికి జగ్జీవన్‌రామ్ కృషి చేశారన్నారు. నేడు దేశంలో ఎగుమతులు ఉచ్ఛస్థాయిలో ఉన్నాయంటే దానికి ఆయనే కారణమన్నారు. ఆయన కూతురు మీరాకుమార్ లోక సభ స్పీకర్‌గా ఉండగా, తెలంగాణ బిల్లును పాస్ చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. జిల్లాలో అభివృద్ధిలో భాగంగా ఈనెల 7న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాన్ని ప్రారంభించనున్నామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ మరమ్మతుకు రూ.25లక్షలు జిల్లా మినరల్ ఫండ్ నుంచి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్యే నిధుల నుంచి మరికొంత సమకూరుస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని దళిత యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ స్టడీ సెంటర్ ఏర్పాటు చేస్తామని, వన్‌టౌన్‌లో ఉన్న లైబ్రరీ స్థానంలో మోడల్ లైబ్రరీని కడతామని, ఎస్ఎల్‌బీసీ వద్ద 25 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అందుకు ప్రభుత్వం రూ.30కోట్లను ఇదివరకే మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, చక్రహరి రామరాజు, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, దున్న యాదగిరి, సుధాకర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు.

అరుణ చేతి వంట ఇంటి భోజనాన్ని తలపించింది

(ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి):సన్న బియ్యంతో అరుణ చేసిన వంట ఇంటి భోజనాన్ని తలపించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సన్నబియ్యం పథకంతో పేదళ్లో కనపడుతున్న సంతోషం చూస్తే నిజమైన తెలంగాణ ఆవిష్కృతమైన సంబరం కలుగుతోందన్నారు. శనివారం నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం దళిత కాలనీలో రేషన్‌కార్డు లబ్ధిదారురాలు మేడి అరుణ ఇంట్లో సన్నబియ్యం భోజనాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సన్నబియ్యం పథకం పేదవాడి ఆత్మగౌరవ పథకమన్నారు. సంపన్నులు తినే సన్నబియ్యం పేద దళితులకు అందించిన చరిత్ర దేశంలో ఒక్క తెలంగాణకే దక్కిందన్నారు. తమది దొరల కుటుంబం కాదని, మధ్య తరగతి రైతు కుటుంబమేనన్నారు. దళితుల ఇంట్లో కింద కూర్చుని తింటుంటే తాను కూడా చిన్నపుడు ఇలాగే కింద కూర్చుని తిన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అరుణకు స్థలం ఉంటే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామని, స్థలం లేకుండే ఇంటి స్థలం, ఇంటిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, జెరిపోతుల భరత్, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రేగట్టె సతీశ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్యసేవలు

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా పేదప్రజలకు కార్పొరేట్ ఉచిత వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రూ.23.75కోట్లతో నిర్మించిన క్రిటికల్‌కేర్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే రూ.22కోట్ల ఎల్‌వోసీలకు ఇచ్చామన్నారు. ఉదయం ఎల్‌వోసీకి దరఖాస్తు చేసుకుంటే సాయంత్రంలోగా ఇస్తున్నామన్నారు. గాంధీ, నీలోఫర్ తర్వాత నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఎక్కువ ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌కు అవసరమైన లిఫ్టు, వెంటిలేటర్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచిందని,అంబులెన్స్ సౌకర్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ జైపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

సమాఖ్య భావనను కాపాడుకోవాలి

రాజ్యాంగం ప్రకారం భారత్ యూనియనే

వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్



డీటీఎఫ్ విద్యాసదస్సులో మాట్లాడుతున్న వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్

మిర్యాలగూడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రకారం భారత యూనియన్‌గా పిలవబడిందని, సమాఖ్య భావనను కాపాడుకోవాల్సి బాధ్యత పౌరులపై ఉందని వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ అన్నారు. శనివారం మిర్యాలగూడలో డీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యాయురాలు కె. ప్రమీల పదవీ విరమణ సందర్భంగా డీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసదస్సు నిర్వహించారు. 'సమాఖ్య విధానం విచ్ఛిత్తి-కేంద్రం దూకుడు' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ చివరి వైస్రాయ్ మౌంట్‌బాటన్ భారత్ దేశం కాదని, ఖండం అని వ్యాఖ్యానించారని అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఏకీకరణ సందర్భంలో 560 సంస్థానాలను విలీనం చేశారన్నారు. 1965 నుంచే సమాఖ్య భావనకు కేంద్ర పాలకులు తూట్లు పొడుస్తూ వచ్చారని అన్నారు. 1967లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి రాష్ట్రాల హక్కులను కాలరాశారన్నారు. జీఎస్‌టీ, సెస్ లాంటి పన్నుల ద్వారా దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 30శాతం నిధులు చెల్లిస్తుండగా, అందులో 18 శాతమే కేంద్రం రాష్ట్రాలకు నిధులు విడుదల చేస్తోందన్నారు. సదస్సులో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, కార్యదర్శి భాస్కర్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారావు, లింగయ్య, యోగానందం, భిక్షమయ్య, రామయ్య, వెంకన్న, ప్రభాకర్, దుర్గయ్య, ఉదయ తదితరులు పాల్గొన్నారు.

● జాబ్ మేళాకు విశేష స్పందన



జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ పోలీస్‌పరేడ్ మైదానంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మేళాకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పలు కంపెనీల ఉద్యోగాలకు ఎంపికైన యువకులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నియామక పత్రాలు అందజేశారు. ●7లో..

అడుగంటిన శాలిగౌరారం ప్రాజెక్టు

ఎండుతున్న చివరి పొలాలు



అడుగంటుతున్న శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మొదలే మండుతున్న ఎండలు. ఆపై అక్రమ నీటి వినియోగంతో జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిగా అడుగంటుతుంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి అక్రమ నీటి వినియోగంతో ప్రాజెక్టు నీటిమట్టం బాగా పడిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం బాగా పడిపోయింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 21 అడుగులకు గాను ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరింది. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు నీరందక నిలువునా ఎండి పోతున్నాయి. గత జూలైలో పూర్తిగా నిండిన ప్రాజెక్టు రెండు పంటలకు రైతులు ప్రధాన కాలువలకు విద్యుత్ మోటార్లతో లిఫ్టింగ్ ఏర్పాటు చేసి అక్రమ నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. దీంతో ప్రాజెక్టు ఆయకట్టులో స్థిరీకరించిన భూములకు నీటి పారుదల సక్రమంగా కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చివరి భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చివరి భూముల రైతులు రాత్రింబవళ్లు తమ పంటలను కాపాడుకోవడానికి కాలువల చుట్టూ నీటికోసం అష్టకష్టాలు పడుతున్నారు.

ధాన్యానికి తక్కువ ధర చెల్లిస్తే చర్యలు

సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్



మిల్లర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటే చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మిల్లర్లు, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,300కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఎంటీ వెరైటీ రకం వడ్లను కూడా కొనుగోలు చేయాలన్నారు. తూకంలో మోసం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, మోసాలకు పాల్పడితే అలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. రైసుమిల్లుల ముందు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మిల్లు యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిల్లు సామర్థ్యం లేకుంటే పక్క మిల్లుకు పంపేవిధంగా చూడాలన్నారు. కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్ ప్రకారం ప్రతీ మిల్లర్ వారి సామర్థ్యంలో 50 శాతం కొనుగోలు చేయాలన్నారు. వేసవిలో రైతుల దాహార్తిని తీర్చేందుకు మిల్లులో మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ,సివిల్‌సప్లయ్ అధికారులు అన్నిరూట్లలో మిల్లుల వద్ద పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో మిలర్స్ అసోసియేషన్ నాయకులు గౌరు శ్రీనివాస్, కర్నాటి రమేష్, బాబ్జి, కుశలయ్య, తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐలు, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

● ఇంట్లో పెళ్లి మాదిరే...

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)



సీతమ్మవారిని పెళ్లికుమార్తెను చేసి తీసుకెళ్తున్న ఉపేందర్ దంపతులు (ఫైల్‌ఫొటో)

శ్రీరామనవమి సందర్భంగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని మాండ్ర గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని ఇంట్లో పెళ్లి తంతు మాదిరే నిర్వహిస్తుంటారు. కల్యాణోత్సవానికి ముందు రోజు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఉండే సీతారాముల ఉత్సవ విగ్రహాలను సన్నాయివాయిద్యాల మధ్య గ్రామంలోని ఇద్దరు ఇంట్లోకి విడిది ఇంటికి చేరినట్లు చేరవేస్తారు. సీతమ్మ విగ్రహాన్ని గ్రామంలోని రేషన్‌డీలర్ తేరటుపల్లి ఉపేందర్ నివాసంలోకి తీసుకువస్తారు. శ్రీరాముల వారి విగ్రహాన్ని బీరవెల్లి యాదగిరిరెడ్డి ఇంటికి చేరవేసే సంప్రదాయాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. ఇంట్లో ఎలాగైతే పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడిని చేసేందుకు ఏ పద్ధతులైతే పాటిస్తామో అవే పాటిస్తారు. నలుగురు ముత్తయిదువులను పసుపుబొట్టుతో ఇంటికి ఆహ్వానించి మంగళవాయిద్యాల మధ్య రెండు ఇళ్లలో పెళ్లి కుమార్తె, కుమారుడును చేస్తారు. బాషికాలు కట్టి, కుమ్మరి వద్దకు వెళ్లి గడికుడుకులు, కూరాడు నీరాడు మాదిరి కుండలు తెస్తారు. మరుసటి రోజున ఇటు సీతమ్మ అటు రామయ్య విగ్రహాలకు ఎదుర్కోలు నిర్వహించి తిరిగి హనుమాన్ గుడికి చేరుస్తారు. గుడి వద్ద ఏర్పాటుచేసే పెళ్లి పందిరిలో తొలుత పెళ్లికుమారుడైన రామయ్యకు కాళ్లు కడిగి కన్యాదానం, యజ్ఞోపవీతధారణ చేస్తారు. సీతమ్మ విగ్రహాన్ని తీసుకువచ్చి కల్యాణం నిర్వహిస్తారు. మహిళలు తలంబ్రాలు సమర్పించిన అనంతరం రెండు ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం తిరిగి హనుమాన్ ఆలయంలోకి చేర్చడంతో శ్రీరామనవమి వేడుకలు పూర్తయితాయి.

భద్రాద్రి రాములోరికి పోచంపల్లి ఇక్కత్ పట్టువస్త్రాలు



● ఎస్ఎస్ జయరాజ్ ఆధ్వర్యంలో నేసిన కార్మికులు

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

భద్రాద్రిలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఈ నెల 6న నిర్వహించే కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులకు యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి ఇక్కత్ పట్టువస్త్రాలను వినియోగిస్తారు. వీటిని ఎస్ఎస్ జయరాజ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు కడవేరు చంద్రశేఖర్, ఆడుపు ఆంజనేయులు, ఇంజమూరి యాదగిరి, దోర్నాల శ్రీనాథ్ భద్రాచలంలోని భక్తరామదాసు ధ్యాన నిలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మగ్గాలపై ఇక్కత్ పట్టు చీరలు, పట్టు పంచెలు కళాత్మక డిజైన్లతో నేశారు. భద్రాచలం దేవాలయ ఈవో రమాదేవి మార్చి 25న మగ్గానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. చేనేత కళాకారులు సీతా రామచంద్రస్వామి, లక్ష్మణుడు, ఆంజనేయుడి ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు నియమనిష్టలతో తయారుచేశారు. సీతమ్మవారికి కల్యాణానికి, పట్టాభిషేకం రోజు అలంకరించేందుకు ఎరుపురంగు బార్డర్, నిమ్మపండు రంగులో రెండుపట్టుచీరలను నేసి తయారుచేశారు. ఉత్సవ మూర్తులైన శ్రీరాముడితో పాటు లక్ష్మణుడు, ఆంజనేయుడికి సమర్పించేందుకు తెలుపు, క్రీమ్ కలర్ జరీ పేట్ డిజైన్‌తో మొత్తం ఆరు పట్టు పంచెలను తయారు చేశారు. శనివారం 5న దేవస్థానం ఈవోకు వస్త్రాలను అందజేశారు. వీటిని కల్యాణం, పట్టాభిషేకం రోజున సీతారాముల వారికి అలకరించనున్నారు. ఈ వస్త్రాలను నేసే మహద్భాగ్యం కలగడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చేనేత కళాకారులు తెలిపారు.



వస్త్రాలు నేసిన పోచంపల్లి చేనేత కళాకారులు

శాలిగౌరారంలో మీసాల రాముడు

● ఇక్కడ రాత్రి పూట కల్యాణం ● నేటి నుంచి బ్రహ్మోత్సవాలు





(ఆంధ్రజ్యోతి-శాలిగౌరారం)

నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో సుమారు 300 ఏళ్ల పూర్వం ప్రాజెక్టు పక్కన నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడి రాముడికి మీసాలు ఉంటాయి. అందుకే మీసాల రాముడిగా ప్రసిద్ధి. ప్రతీ ఏడాది శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణం ఇక్కడ చూడ ముచ్చటగా జరుగుతుంది. ఇక్కడి రాముడికి శక్తి కొలది వెండి, బంగారు మీసాలు సమర్పిస్తే పండంటి కుమారుడు జన్మిస్తాడని భక్తుల విశ్వాసం. ఇక్కడి సీతమ్మకు పుస్తె మట్టెలు సమర్పిస్తే పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని, దాంపత్య జీవితం గొప్పగా ఉంటుందని ఇక్కడి గ్రామీణ ప్రజల నమ్మకం.

సేద తీరాక.. కల్యాణానికి సిద్ధం

ఎక్కడైనా సీతారాముల కల్యాణం మధ్యాహ్నం నిర్వహిస్తుంటారు. కానీ శాలిగౌరారంలో మాత్రం రాత్రి పూట కల్యాణం జరుపుతారు. ఇందుకు ఒక ప్రత్యేక కథ ప్రచారంలో ఉంది. భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగిన తరువాత రథంపై శ్రీసీతారాములు శాలిగౌరారం దేవాలయానికి వస్తారని, కొద్దిసేపు సేద తీరిన తరువాత మళ్లీ ఇక్కడ కల్యాణానికి సిద్ధమవుతారని ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో కల్యాణాన్ని రాత్రి పూట నిర్వహిస్తారు.

ఈ నెల 6 నుంచి 11 వరకు ఉత్సవాలు

శాలిగౌరారం శ్రీ సీతారాముల బ్రహ్మోత్సవాలు ప్రతీ ఏడాది శ్రీరామనవమి నుంచి మొదలవుతాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు పెద్దఎత్తున హాజరవుతారు. ఈ పర్యాయం ఈ నెల 6న ఆదివారం మధ్యాహ్నం గరుడ హోమం, గరుడముద్ద, రాత్రి 9 గంటలకు ఎదుర్కోలు, రాత్రి 10 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. 7న సోమవారం ప్రాబోధక ఆరాధన, రాత్రికి హనుమంత సేవ, 8న మంగళవారం రాత్రి సదస్యం గరుడసేవ(మొక్కు సేవలు) ఉంటాయి. 9న బుధవారం ఉదయం సుదర్శన హోమం, బలిహరణం, రాత్రి పొన్నసేవలు ఉంటాయి. 10న గురువారం మధ్యాహ్నం చక్కర స్నానం, రాత్రికి జాతర . శేషం ఆనందాచార్యులచే దోపు కథ, హరికథ ఉంటుంది. 11న శుక్రవారం రాత్రి 7 గంటలకు ఏకాంత సేవలు ఉంటాయి. ఈ సందర్భంగా శేషం రామచంద్రచార్యుల ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం, పులుగుళ్ల పద్మల ఆధ్వర్యంలో భక్తి సంగీత గానం, శేషం శ్రీకాంతచార్య వేదపఠనం, శేషం రఘునందన చార్యులు రామాయణ పారాయణం, వేదాంతం కృష్ణమాచార్యుల దివ్య ప్రబంధ పారాయణం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ధర్మకర్త శేషం రత్నమాచార్యులు తెలిపారు.





రామనవమికి... తమ్మర ప్రత్యేకం

(ఆంధ్రజ్యోతి-కోదాడ రూరల్)

సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో తమ్మర గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం రెండవ భద్రాద్రిగా ప్రసిద్ధి. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవానికి తరలివస్తారు. ఈ పర్యాయం ఉత్సవాలకు అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బత్తిని వేణుగోపాల్ తెలిపారు. సుమారు 5వేల మందికి పైగా భక్తులు హాజరవుతారని ఆయన తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగు నీటి సౌకర్యం, స్వచ్ఛంద సంస్థల ద్వారా మజ్జిగ ప్యాకెట్లు అందించేందుకు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

ఓ రామా..శ్రీరామా..


● సుగుణాభి రాముడు ● కుమారుడు, భర్త, అన్నగా నేటి తరానికి ఆదర్శం

● బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచిన పాలనాదక్షుడు

● ఏకపత్నీవ్రతుడు ● నేడే శ్రీసీతారాముల కల్యాణం

చిన్నతనం నుంచే దురాశ, దుర్గుణాలు లేకుండా ఉత్తమ కుమారుడిగా తండ్రికి, ఏకపత్నీవ్రతుడుగా భార్యకు, కష్టాలలో తమ్ములుకు అన్నగా, తన రాజ్యంలో బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన శ్రీరాముడిని నాడూ, నేడూ ఉత్తమ పురుషుడిగా కొనియాడటం పరిపాటి. అంతేకాక పితృధర్మం, మాతృధర్మం, భ్రాతృధర్మం, స్నేహధర్మం, పత్నీధర్మం, ఋషులధర్మం ఇలా అన్నిధర్మాలు తెలిసినవాడు, ఆచరించిన రాముడు. అందుకే 'రామోవిగ్రహవాన్ ధర్మః' అంటూ శత్రువులు కూడా ఆయనను స్తుతించారు. అందుకే ఆయన బాటలోనే ప్రతి ఒక్కరూ నడవాలని పెద్దలు చెబుతుంటారు. సకల సద్గుణాల కలయిక శ్రీరాముడు. అయితే ఆ రాముడి సగుణాలను వదిలి నేటి తరం నడుస్తోంది. రాముడి లక్షణాలను పుణికి పుచ్చుకుంటే కుటుంబంతో పాటు సమాజమూ బాగుంటుంది.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)



శ్రీరామనవమి రోజున రామయ్య ఆశీస్సులు కోసం, తమ జీవితంలో విజయం కోసం ప్రార్థిస్తుంటారు. కానీ రామయ్య కాలం మారింది. ప్రతి ఒక్కరిలో స్వార్థం. తల్లిదండ్రుల పట్ల చిన్నచూపు, తోబుట్టువులు, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, భార్యభర్తల మధ్య కొరవడిన ప్రేమ, పెరుగుతున్న వివాహేతర సంబంధాలు, స్నేహితుల మధ్య మోసపూరిత వాతావరణం, గురువులపై కనపడని అనురాగం, వ్యక్తుల మధ్య అడ్డుగోడలుగా నిలుస్తున్న సంపద, ఎదుటివారిపట్ల కనపడని మానవత్వం నేటి సమాజంలో వేళూనుకుంటోంది. అందరికీ ఆదర్శవంతుడైన శ్రీరాముడి కల్యాణం రోజైన వాటిని వదలి, ఆదర్శ రామరాజ్యం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పెద్దలు చెబుతున్నారు.

పితృధర్మ పరిపాలకుడు..

తండ్రి మాట జవదాటనివాడు ఆనాటి శ్రీరాముడు. తండ్రి ఆజ్ఞను ఆచరించే కుమారుడిగా నడుచుకున్నాడు. కానీ నేటి సమాజంలో తన తండ్రి మాట వినని వారు తన కుమారుడు తన మాట వినాలని కోరుకుంటున్నాడు. మచ్చుకైనా పితృధర్మం కనిపించని పరిస్థితి.

మాతృధర్మానికి కట్టుబడి అడవులకు...

ముగ్గురు తల్లులను ఒకేరకంగా గౌరవించినవాడు ఆనాటి శ్రీరాముడు. తల్లి కౌసల్య ఎంతో, సుమిత్ర, కైకేయిలు ఊడా ఆయనకు అంతే. సవతి తల్లి కోరికను మన్నించి అడవులకు పోయినవాడు శ్రీరాముడు. నేటి మానవుడికి తల్లి, తండ్రి బరువే. అందుకే వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయి. కుమారుడు, కోడలు మాట కాదంటే తల్లిదండ్రులు నేడు వృద్ధాశ్రమాలకు వెళ్లాల్సి వస్తోంది. నాడు తల్లిదండ్రులు ఎంతమంది పిల్లలున్నా తమ దగ్గర ఉంచుకొని ఆలనాపాలనతో పాటు, విలువలతో కూడిన సమాజ సంబంధాలను చెప్పేవారు. నేడు తల్లిదండ్రులు ఒక్కరూ లేదంటే ఇద్దరు పిల్లలతో సరిపుచ్చుకోవటమేకాక పిల్లలను తమ దగ్గర ఉంచుకోకుండా హాస్టల్ చదువులకు పరిమితం చేయటంతో సమాజమన్నా, విలువులన్నా నేటి తరానికి తెలియకపోవటంతో తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య అనురాగాలు, అప్యాయతలు కొరవడి అగాథాలకు దారితీస్తోంది.

భ్రాతృధర్మం

అన్న మాటకు ఎదురు చెప్పనివారు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు. తానన్న మాటను తప్పనివాడు శ్రీరాముడు. నేడు అవీ ఏవీ మచ్చుకు కనిపించవు. నవమాసాలు ఒకే తల్లిగర్భం నుంచి పుట్టిన అన్నదమ్ములు, తోబుట్టువుల మధ్య ఆస్తి అడ్డుగోడలుగా నిలుస్తున్నాయి. తగాదాలు, చంపుకునే వరకు వెళ్తున్నాయి. అరమరికలు లేకుండా చిన్నతనంలో అన్నతమ్ములు ఒకటిగా ఉంటూ, పెళ్లితో ఇద్దరి మధ్య అగాథములతో పాటు కుటుంబం విడిపోవటానికి దారితీస్తోందీ నేడు. అంతేకాక ఒకరి మాట పట్ల మరొకరికి గౌరవం లేకుండాపోతోంది.

స్నేహధర్మానికి నిదర్శనం రామ, సుగ్రీవులు

ఆనాడు రాముడు, సుగ్రీవులు ఉత్తమ స్నేహధర్మానికి ప్రతీకలు. ధర్మ సంస్థాపనమే ధ్యేయంగా ఉండేది. నేటి కాలంలో మధురస్నేహం లేదు. అవకాశవాద, మోసపూరిత స్నేహమే కనిపస్తోంది. అవసరం ఉంటే అతుక్కోవటం లేదంటే విడిపోవటం నేటి స్నేహితుల లక్షణంగా ఉంటుంది. స్నేహం పేరుతో పక్కనే ఉంటూ గొయ్యి తీస్తూ ముంచటం పారిపాటిగా మారింది.

పతి ధర్మం.. ఏకపత్నీవ్రత్యం

పతి ధర్మంగా ఒక స్త్రీ పట్ల భర్తగా బాధ్యత. అలానే స్త్రీకి పురుషుడి పట్ల గౌరవము ఆనాటి పాతివ్రత్యాన్ని చాటుతుంది ఏకపత్నీవ్రత్యం. నేడు ఏక పత్నీవ్రతము ఎక్కడో మాత్రమే కనిపిస్తోంది. భార్యను గౌరవించే భర్త కూడా దొరకటం నేడు అరుదు. నేడు ఆకర్షణ, డబ్బు, హోదాలతో వివాహేతర సంబంధాలకు పెరిగి, చివరకు కడుపున పుట్టిన బిడ్డలను చంపుతున్న తల్లిదండ్రులు చూస్తున్న వైనం. అందుకు హైదరాబాద్‌లో మూడు రోజుల క్రితం పిల్లలను తల్లులు చంపిన రెండు సంఘటనలను నేటి పరిస్థితులను తెలియజెబుతున్నాయి.

ఋషిధర్మం

ఋషి అనగానే మనకు బ్రహ్మర్షియైన వశిష్ఠుడు, రాజర్షియైన విశ్వామిత్రుడు గుర్తుకు వస్తారు. వారికున్న తపస్సంపద అపూర్వం, అసాధ్యం. తపస్సంపన్నులైన ఋషి సంప్రదాయము నాడు మహోన్నతంగా గౌరవింపబడేది. ఋషులకు అత్యంత ప్రాముఖ్యం ఉండేది. వారి తపోధారల ద్వారా లోకానికి మేలు జరిగేది. నేడు సన్యాసం పుచ్చుకున్నాను అనుకునే వారందరూ ఋషులే. నాటి ఋషికి సృష్టి కర్తకున్న గౌరవం ఉండేది. నేడది శూన్యం.

అబద్ధాలు చెప్పకూడదు..

రాముడి జీవితంలో ఎప్పుడూ అబద్ధం అనేది చెప్పలేదట. ప్రస్తుత కాలంలో జీవితంలో అబద్ధం చెప్పకుండా అస్సలు ఉండలేరు. నిత్యం ఏదో ఒక విషయంలో అబద్ధం చెబుతూనే ఉంటారు. ఒక అబద్ధం చెప్పి దాన్ని కవర్ చేసుకునేందుకు ఇంకో అబద్ధ చెబుతూనే ఉన్నారు. అలా గడిపేస్తున్నారు. ఒక్కసారి నిజం చెబితే అబద్ధం అవసరం అనేదే ఉండదని ప్రస్తుతం తరం వారు గుర్తించాలి.

మర్యాదగా మాట్లాడటం..

రాముడి జీవితంలో ఎన్నడూ అసభ్యకరమైన మాటలను అస్సలు మాట్లాడలేదట. ప్రస్తుతం తరం వారు చీటికి మాటికి పరుష పద జాలం వాడటం అనేది సర్వసాధారణమైంది. ఈ అలవాటును మానుకుంటే వీరు ఉత్తములవుతారని గ్రహించాలి.



తప్పు ఒప్పుకుంటే

తన రాజ్యంలో ఎవరైనా తప్పు చేసి ఆ వ్యక్తి తనకు ఎంత హాని చేసినప్పటికీ ఆ విషయాన్ని వారు తెలుసుకుని, రాముడి వద్ద లొంగిపోతే..వారిని మన్నించడమే తన జీవిత సూత్రంగా పెటుకునేవారట. అయితే ప్రస్తుతం కలియుగంలో పరిస్థితి ఎలా మారిందంటే మహాపురుషులు చూపిన మార్గాలను చెప్పిన మాటలను చెబుతున్నారు తప్ప ఎవరూ ఆచరించడం లేదు. దీంతో అవి టీవీల్లో, సీరియల్స్ మాదిరిగా పుస్తకాలలో కథల్లా అలా ఉండిపోతున్నాయో తప్ప, ఆచరణలో అమలు కావటంలేదు. శ్రీరాముడు కల్యాణం రోజైనా ప్రతీ ఒక్కరిలో మార్పు రావాలని, శ్రీరామరాజ్యం తిరిగి రావాలని కోరుతున్నారు పెద్దలు.

చిరునవ్వుతో ప్రారంభం

రాముడు ఇతరుల నుంచి ఏది ఆశించడు. ఎవరితో ఏదైనా విషయం మాట్లాడాలంటే చిరునవ్వుతో తన సంబంధాన్ని సంభాషణను ప్రారంభించే వారని పురణాల్లో పేర్కొన్నారు. అంతేకాక ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే దాన్ని అప్పుడే మర్చిపోయేవారు. ఎందుకంటే ఇతరులకు సహాయం చేయాలి, అందుకు ప్రతిఫలం ఆశించకూడదని చెప్పేవారట. రాముడు తన గొప్పతనం గురించి ఎప్పుడూ ఆలోచించలేదట. ఎక్కడా తన కీర్తి, ప్రతిష్ఠల గురించి చెప్పుకోలేదట. ప్రస్తుత తరం వారు ఏదైనా చిన్న విజయం సాధించినా..చాలా గొప్పగా చెప్పుకుంటారు. ఎవరైనా వారి జీవితంలో ఏదో ఒక తప్పు చేస్తుంటారు. అయితే కొన్నిసార్లు మంచి పనులు కూడ చేస్తుంటారు. అలా చేసిన మంచి పనుల గురించి రాముడు ప్రస్తావించేవాడట. ఎవరైనా విమర్శిస్తే నిరుత్సాహ పడకుండా సావధానంగా వినేవాడట. వారిలో ఉన్న అపోహలను తొలగించేవాడట. అయితే ప్రస్తుత తరం వారు ఎవరైనా విమర్శిస్తే వాటిని స్వీకరించి, తమ లోపాలను అధిగమించాల్సింది పోయి ఎదురు దాడి మొదలు పెడుతుంటారు.

రాముడు తన జీవితంలో తాను వివాహమాడిన సీతాదేవి గురించి తప్ప ఎన్నడూ పరస్త్రీ గురించి ఆలోచించలేదని వారంటున్నారు. అందుకే చాలామంది స్త్రీలు తమకు రాముడులాంటి ఏకపత్నీవ్రతుడు కావాలని ఇప్పటికీ కోరుకుంటూ ఉంటారు. తన సంపాదించిన డబ్బును ఎప్పటికీ దుబారా ఖర్చులు చేయలేదు. తన రాజ్యంలో అందరికీ ఉపయోగపడేలా ఖర్చు చేశారు. ప్రజలకు మాత్రమే కాకుండా భూమిపై ఉన్న ప్రతి జీవికి శ్రేయోభిలాషిగా ఉండేవారు.

బంగారంతో సూక్ష్మరూపంలో జైశ్రీరామ్

శ్రీరామనమిని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన స్వర్ణకారుడు బంగారంతో శ్రీరామబాణం, విల్లు, జైశ్రీరామ్ అక్షరాలు తయారు చేశారు. స్వర్ణకారుడు కటకం నవ్యహరికుమార్ 140 మిల్లీగ్రాముల బంగారంతో బాణం, విల్లు, జైశ్రీరామ్ అక్షరాలు తయారుచేసి భక్తిని చాటుకున్నాడు.

(ఆంధ్రజ్యోతి-చిట్యాల)



బంగారంతో తయారుచేసిన జైశ్రీరామ్, బాణం, విల్లు

సూర్య చంద్రుల ఆకృతిలో రామబాణం



యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పరిధిలోని రామునిబండపైన ఉన్న శ్రీసీతారామచంద్రుల ఆలయంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా పూజారి పారునంది లక్ష్మణమూర్తి సూర్యచంద్రుల ఆకృతిలో రామబాణం తయారుచేశారు. శనివారం ఆలయం వద్ద భక్తుల సందర్శనార్థం ఉంచారు. రామ, రావణ యుద్ధంలో శ్రీరామచంద్రుడు సూర్యచంద్రుల బాణం వేసి రావణాసురుడి కడుపులోని అమృత భాండాన్ని పగులకొట్టాడని పురాణాల్లో ఉందన్నారు.

(ఆంధ్రజ్యోతి- మోత్కూరు)

తాగిన మైకంలో తల్లిపై కుమారుడి దాడి



మోజీ మృతదేహం, కుమారుడు శ్రీను

బీబీనగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో కుమారుడు తల్లితో డబ్బుల కోసం గొడవ పడి విచక్షణ మరిచి దాడి చేయడంతో దెబ్బలకు తాళలేక ఆ తల్లి అపస్మారక స్థితికి చేరుకుని ప్రాణాలు వదిలింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గుర్రాలదండి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తతండాలో శనివారం వెలుగు చూసింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త తండాకు చెందిన బానోతు మోజి(55) భర్త మృతి చెందడంతో కుమారుడు బానోతు శ్రీనుతో కలిసి ఉంటోంది. కాగా, కొంత కాలం క్రితం కుమారుడు శ్రీను ఉపాధి కోసం భార్య రాధిక, పిల్లలతో కలిసి చేవెళ్ల ప్రాంతానికి వలస వెళ్లాడు. అక్కడే ఉంటూ అల్లంవెల్లుల్లి వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏదో కారణంతో శుక్రవారం భార్య రాధికతో గొడవ పడి అదే రోజు రాత్రి సొంత గ్రామం కొత్త తండాలోని తల్లి మోజీ వద్దకు వచ్చాడు. మద్యం తాగిన మత్తులో డబ్బులు కావాలని తల్లితో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాట మాట పెరగడంతో ఆవేశంలో శ్రీను తల్లిపై విచక్షణ రహితంగా దాడిచేశాడు. దీంతో దెబ్బలకు తాళలేక ఆమె అపస్మారక స్థితికి చేరింది. భయపడిన శ్రీను స్థానికుల సహకారంతో కుషాయిగూడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై మోజి సోదరుడు కేతావత్ హంక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడు శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఇంక్రిమెంట్ తక్కువ వేశారని కార్మికుడి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఇంక్రిమెంట్ తక్కువ పడిందని మనస్తాపంతో ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామంలో జరిగింది.సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం బసునూరు గ్రామానికి చెందిన షేక్ సయ్యద్(50) 20 ఏళ్ల నుంచి చౌటుప్పల్ మండలం అంకమ్మగూడెం పరిధిలోని ఓ కంపెనీలో పనిచేస్తూ ఎల్లంబావిలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇటీవల పరిశ్రమలో ఉద్యోగులకు ఇంక్రిమెంట్ వేశారు. సయ్యద్‌కు తక్కువ ఇంక్రిమెంట్ వేయడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ విషయమై పరిశ్రమ యజమానులను ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించారు. దీంతో మనస్తాపానికి గురైన సయ్యద్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ సమయంలో భార్యా, పిల్లలు వేరే గదిలో ఉన్నారు. తెల్ల వారు జామున వారు లేచి చూడగా, ఉరేసుకుని ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తన భర్త చావుకు పరిశ్రమ యాజమాన్యంతో పాటు శేఖర్ అనే వ్యక్తి కారణమని భార్య జానిబీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

(5వ పేజీ తరువాయి)

బుక్ చేసుకోవాలని, అప్పటికప్పుడు హడావుడి పడే పరిస్థితి రావద్దన్నారు. రజతోత్సవ సభపై విస్తృతంగా ప్రచారం చేయాలని, చలో వరంగల్ పేరుతో వాల్ రైటింగ్స్ రాయించాలన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందని, ప్రజలు తిరగబడే పరిస్థితి కనిపిస్తోందని ఈ సందర్భంగా కేసీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులపై నిత్యం వారితో కలిసి పోరాడాలని సూచించారు. బీజేపీ సైతం ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని, ఇచ్చిన హామీల అమలుపై ప్రధాని మోదీ మాట్లాడడం లేదని పేర్కొన్నారు. రజతోత్సవ సభ ముగిశాక పార్టీ సంస్థాగత నిర్మాణం చేపడతామని చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదు చేయించి, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కొత్త కార్యవర్గాలను నియమిస్తామని తెలిపారు. క్యాడర్‌కు శిక్షణ ఏర్పాటు చేద్దామని, సైద్ధాంతికంగా క్యాడర్‌ను బలంగా తీర్చిదిద్ది, ప్రజా సమస్యలపై, ప్రభుత్వాల అపసవ్య విధానాలపై ఉద్యమకార్యాచరణతో పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, తిప్పన విజయసింహారెడ్డి, నోముల భగత్, తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌తో సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

‘థర్మల్’ నిర్వాసిత కుటుంబాల్లో వెలుగులు

● యాదాద్రి విద్యుత్ పరిశ్రమ ఏర్పాటులో భూములు కోల్పోయిన 112 మందికి ఉద్యోగాలు ● భూ బాధితుల్లో ఆనందం

యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో భూములు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఉపాధి, నివాస గృహాలు ఏర్పాటు చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శుక్రవారం బాధిత కుటుంబాలకు ఉద్యోగ నియామకపత్రాలు అందించడంతో వారి కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి- దామరచర్ల)

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన నీటి వనరులు, పరిశ్రమకు సరిపడా భూములు ఉన్నాయి. దీంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2015 జూలై 8న 4వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్య కలిగిన యాదాద్రి విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పరిశ్రమ కోసం మొత్తం 4,676 ఎకరాల భూమిని మండలంలోని వీర్లపాలెం, తాళ్లవీరప్పగూడెం, తిమ్మాపురం, నర్సాపురంగ్రామాలతోపాటు మోదుగులతండా, కపూరతండా గ్రామాల నుంచి పట్టా, ఉడాఫ్, వివిధ రకాల భూములను అధికారులు సేకరించారు. ఇందులో మోదుగులతండా తండా, కపూరతండా రెండు గ్రామాలు భూములతోపాటు ఇళ్లు పరిశ్రమ ఏర్పాటు ప్రాంతంలో ఉండడంతో రెండు గ్రామాలను ఖాళీ చేయించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద పునరావాసం కల్పించారు. మొత్తం 520 మంది రైతులు భూములు కోల్పోయారు. వారిలో తొలి విడతగా మోదుగులతండా, కపూరతండాకు చెందిన భూములతోపాటు ఇళ్లు కోల్పోయిన మొత్తం 173 మందిని మొదటి విడతలో అర్హులుగా ఎంపిక చేశారు. వీరిలో 40 మంది వయస్సు రీత్యా, వివిధ కారణాలతో ప్రభుత్వం అందించిన నగదు ప్రోత్సాహకాన్ని తీసుకున్నారు. మిగిలిన 133 మందిలో స్వల్ప కారణాలతో 21 మంది ఉద్యోగ నియామకపత్రాలు పరిశీలనలో ఉండగా 112 మందికి తాజాగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, టీఎస్‌జెన్‌కో అధికారుల సమక్షంలో నియామకపత్రాలను అందించారు. వీరు నెల రోజుల వ్యవధిలో పరిశ్రమలో విధుల్లో హాజరు కావాలని నియామకపత్రంలో పేర్కొన్నారు. దీంతో భూములు కోల్పోయి ఉద్యోగాలు పొందిన రైతుల మొఖంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. భూములు కోల్పోయిన వారికి కూడా త్వరలోనే ఉద్యోగ నియామకపత్రాలు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. దామరచర్ల మండలంలో అత్యధిక శాతం గిరిజనులు ఉన్నందున వారి కోసం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంను కోరారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ నుంచి ఉద్యోగ నియామక పత్రాలు అందుకుంటున్న నిర్వాసితులు

ప్రత్యేక బస్సులో ప్రజాభవన్‌కు

కాగా పరిశ్రమ ఏర్పాటులో భూములు కోల్పోయిన మోదుగులకుంట, కపూరతండా గ్రామాలకు చెందిన తొలివిడత ఉద్యోగానికి అర్హత పొందిన 112 మందిని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో ప్రజాభవన్‌కు తరలివెళ్లారు.

అక్కడ డిప్యూటీ సీఎంతోపాటు జెన్‌కో అధికారుల సమక్షంలో ఉద్యోగ నియామకపత్రాలను అం దుకున్నారు.

అర్హతకు తగిన ఉద్యోగం

యాదాద్రి థర్మల్ పరిశ్రమలో భూములు, ఇండ్లు కోల్పోయిన మోదుగులకుంతండా, కపూరతండాకు చెందిన 112 మందికి అర్హతకు తగిన విధంగా నాలుగు విభాగాలుగా ఉద్యోగ నియామకపత్రాలను అందజేశారు. డిగ్రీ, ఇంజనీరింగ్, ఆపై ఉన్నత చదువులు చదివిన 21 మందిని జూనియర్ అసిస్టెంట్లుగా, డిప్లొమో, ఐటీఐ పూర్తి చేసిన 39 మందికి జూనియర్ ప్లాంట్ అటెండెట్‌గా నియమించారు. మిగిలిన 52 మందిలో కొందరిని 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారికి సబార్డినేట్ పోస్టులను కేటాయించగా పదోతరగతి కంటే తక్కువ చదివిన వారిని హౌస్ కీపింగ్ పోస్టుల్లో తీసుకున్నారు

సీఎం, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

భూములు కోల్పోయిన బాధితులకు నియామకపత్రాలు అందజేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగం కల్పించినందుకు ప్రజాప్రతినిధులతోపాటు అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం, డిప్యూటీ సీఎం, ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నిర్వాసిత కుటుంబాలు

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

పాలకవీడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో శనివారం జరిగింది. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన వట్టే నాగరాజు(37) తన సమీప బంధువైన గరిడేపల్లి మండలం కల్మల్‌చెర్వు గ్రామానికి చెందిన యాతగాని సైదులు చనిపోవడంతో దహన సంస్కారాలకు శుక్రవారం బైక్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రానికి తిరిగి ఇంటికి రాకపోవడం, ఫోన్‌చేసినా ఎత్తకపోవడంతో బంధువులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు దారి వెంట వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం పాలకవీడు మండలంలోని శూన్యపహాడ్ గ్రామపరిధిలో రోడ్డు పక్కన నాగరాజు తల వెనుక భాగాన బలంగా దెబ్బతగిలి, రక్తం పోయి విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా దవాఖానాకు తరలించారు. నాగరాజు తమ్ముడు గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. నాగరాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



నాగరాజు (ఫైల్)

ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం

● పోలీస్‌స్టేషన్‌లో కాలిపోయిన సీజ్‌వాహనాలు



కాలిపోయిన వాహనాలు

కోదాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని పోలీసుస్టేషన్ వెనుక శనివారం అగ్నిప్రమాదం జరిగింది. నాలుగుకార్లు కాలిపోయాయి. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పోలీసుస్టేషన్ ఆరుబయట కొందరు పోగుచేసిన చెత్తను కాలుస్తుండగా, గాలికి నిప్పు రవ్వలు వచ్చి స్టేషన్‌లోని చెత్తాను తాకటంతో మంటలు చెలరేగాయి. దీంతో స్టేషన్‌లో సీజ్ చేసిన కార్లకు, ద్విచక్రవాహనాలకు, ఆటోలకు మంటలు అంటుకోవటంతో నాలుగు కార్లు కాలిపోయినట్లు తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, మంటలు అదుపులోకి తీసుకురావటంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. లేదంటే పక్కనే ఉన్న పెట్రోల్ బంకు మంటలు అంటుకొని పెద్దప్రమాదం జరిగేదన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొత్త ఆవిష్కరణలకు సిద్ధంగా ఉండాలి

కోదాడ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని, ముందుచూపుతో కొత్త ఆవిష్కరణలకు సిద్ధంగా ఉండాలని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, ఈవీఎం సిస్టమ్ అధిపతి ఇమ్మానుయేల్ గోస్లా అన్నారు. శనివారం కోదాడ అనురాగ్ కళాశాలలో ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగం విద్యార్థులు ఘనంగా వార్షికోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో తల్లిదండ్రులని, గ్రామాన్ని అవగాహన చేసుకొని అవసరమైన సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దేనిని గుడ్డిగా అనుసరించవద్దన్నారు. డ్రగ్స్ లాంటి వాటికి దూరంగా ఉండి అబ్దుల్‌కలాం, ఎల్లాప్రగడ సుబ్బారావు, వరప్రసాద్, సునీత, విలియమ్స్ వంటి వారి నుంచి స్ఫూర్తిపొంది సాంకేతిక నైపుణ్యంపై అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. ఇష్టంగా చదివి కష్టాలను అధిగమించాలన్నారు. అనంతరం కళాశాల సెక్రటరీ, జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చక్కటి బోధనా అనుభవం ఉన్న సిబ్బంది ద్వారా ఉత్తమ ఇంజనీర్లను తయారుచేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. కళాశాలలో చదువుతున్న ప్రతి ఒక్కరినీ కుటుంబ సభ్యులుగా భావించి సకల సౌకర్యాలు కల్పించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టీ సురేష్‌కుమార్, చిన్న ఈశ్వరయ్య, కళాశాల సొసైటీ ట్రెజరర్ వేనేపల్లి వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, బోధన సిబ్బంది, ఇంజనీరింగ్ ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

సూర్యాపేటరూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువతి మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని రాయునిగూడెం సమీపంలోని సెవెన్ ఆర్ హోటల్ వద్ద శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లలమర్రి గ్రామానికి చెందిన దాసరి విజిత(23) సెవెన్‌ఆర్ హోటల్‌లో పనిచేస్తుంది. శనివారం విధులకు వెళ్తున్న క్రమంలో హోటల్ ఎదుట రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడడంతో విజిత అక్కడికక్కడే మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

గరిడేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండంలోని వెలిదండ గ్రామానికి చెందిన గండు రాంబాబు ట్రాక్టర్‌తో పొలంలోకి మట్టి తరలిస్తున్నాడు. ఆ క్రమంలో ట్రాక్టర్‌ను రివర్స్ చేస్తుండగా, ఒక్కసారిగా ట్రాక్టర్ పల్టీకొట్టింది. సీట్‌లో నుంచి డ్రైవర్ రాంబాబు కింద పడడంతో తలకు, చెవికి గాయాలయ్యాయి. వెంటనే 108వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుత్రికి, అక్కడి నుంచి సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టా మూర్తులను వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్పటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.55,50,205 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



ప్రాకార మండపంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీతారాముల ఎదుర్కోళ్లు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి చెంత శివాలయంలో శనివారం సీతారాముల ఎదుర్కోళ్లత్సవం వైభవంగా జరిగింది. స్వామిఅమ్మవార్లను అత్యంత శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. వేద మంత్రాలు, సన్నాయిమేళాల నడుమ ఉత్సవాలు వేడుకగా జరిగాయి. సీతారామహనుమత్ మూర్తులకు అష్టోత్తర శత నామార్చనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్ శర్మ, గజ్వేల్లి రమేష్‌బాబు, పర్యవేక్షకులు నాగుల మహేష్, దీరావత్ రామరావునాయక్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పారాయణాలు నిర్వహిస్తున్న అర్చకులు

మిల్లర్ల మాయాజాలం

(5వపేజీ తరువాయి)



మిర్యాలగూడలో రైస్ మిల్లుల ఎదురుగా బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

ముక్యాల బ్రాంచ్ కెనాల్ పరిధిలో 1.12లక్ష ఎకరాల్లో, బోరు బావుల కింద మరో 35వేల ఎకరాల్లో యాసంగిలో రైతులు వరి సాగు చేశారు. ఎకరానికి సుమారు 40 బస్తాలకుపైగా దిగుబడి వచ్చింది. వారం రోజులుగా ఆకాశం మబ్బులు పడుతుండటంతో రైతులు ముమ్మరంగా పంట నూర్పిడి చేస్తున్నారు. పచ్చి ధాన్యాన్ని నేరుగా మిల్లులకు తరలిస్తుండగా, మిల్లర్లు సిండికేటై ధర తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.గత ఏడా ది మిల్లర్లు సన్నాలను రూ.2,500 నుంచి రూ.2,800 వరకు కొనుగోలుచేశారు. ప్రస్తుతం హెచ్ఎంటీ, చింట్ల ను రూ.1,900 నుంచి రూ.2,050 వరకు చెల్లిస్తున్నారు. గత ఏడాది వానాకాలంలో ప్రభుత్వం 308 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 44,143 మంది రైతుల నుంచి 2,26,182 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసింది. అందుకు రూ.520కోట్లు చెల్లించగా, సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ దక్కింది. జిల్లా వానాకాలంలో 2.26లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన అధికారులు, యాసంగికి వచ్చేసరికి 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి



ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. వానాకాలంలో కొనుగోలుచేసిన విధంగా యాసంగిలోనూ మిల్లర్లు అదే ధరకు ధాన్యం కొనుగోలుచేయాలి. ధర తగ్గించి రైతుల శ్రమను దోచుకోవడం సరికాదు.

-పల్లె వెంకటరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

ధాన్యానికి మద్దతు ధర దక్కడం లేదు



ఈ ఏడాది హెచ్ఎంటీ రకాలను సాగు చేశా. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ఆసక్తి చూపడం లేదు. వారు అడిగిన ధరకు ఇస్తేనే తీసుకుంటున్నారు. కనీసం మద్దతు ధర రావ డం లేదు. వాతావరణం సరిగా లేక పోవడంతో నిల్వ ఉంచుకునే పరిస్థితి లేదు. నష్టానికే ధాన్యం విక్రయించా.

బాబి, సత్యనారాయణపురం, త్రిపురారం మండలం

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	517.10
టీఎంసీలు	144.0402
ఎడమకాల్వకు నీటి విడుదల	5,087
కుడికాల్వకు	3,031
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	10,218

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.80 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	625.67 అడుగులు
టీఎంసీలు	0.90
కాల్వలకు విడుదల	469.44 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	500.10 క్యూసెక్కులు

శాంతిభద్రతలతో పాటు సామాజిక బాధ్యత అభినందనీయం

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ క్రైం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం పోలీస్‌శాఖ పనితీరు అభినందనీయమని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌పరేడ్ మైదానంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన హాజరై ఉద్యోగాలకు ఎంపికైన వారికి కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి నియామక పత్రాలను అందజేసి మాట్లాడారు. పోలీస్ అధికారులు, సిబ్బంది 24గంటలు 365 రోజులు సెలవులు సైతం లేకుండా పనిచేస్తూ ప్రజల భద్రతతో పాటు ప్రజలు, యువత కోసం పాటుపడటం గొప్ప విషయమన్నారు. నల్లగొండ జిల్లా పోలీస్‌శాఖ తరుపున జిల్లాలో తన రాజకీయ జీవితంలో ఇంత వరకూ ఎన్నడూ చేయలేదని, ఇంత పెద్ద జాబ్ మేళా నిర్వహించడం సంతోషకరమన్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాని వారు కూడా ఈ జాబ్ మేళాలో ఉద్యోగాల కోసం వచ్చారని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరుపున అతి త్వరలో మరో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తామన్నారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా నల్లగొండను తీర్చిదిద్దడంలో మిషన్ పరివర్తన్‌ను అమలు చేసి డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు పోలీస్‌శాఖ పని చేస్తున్న తీరు అభినందనీయమన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న అన్ని సామాజిక కార్యక్రమాలకు పూర్తి సహకారం ఉంటుందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన వారు ఎంత దూరమైనా వెళ్లి పని చేయాలని సూచించారు. ఎక్కడ ఉద్యోగం వచ్చినా పనిచేయాలని ఆ అనుభవమే భవిష్యత్తులో లోకల్‌లో ఉద్యోగాలు సాధించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యువతను సన్మార్గంలో పయనింపజేయడ మే తమ లక్ష్యమని అన్నారు. అందుకే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే యువతేజం అనే కార్యక్రమాన్ని తీసుకుని యువతకు కబడ్డీ పోటీలు నిర్వహించామన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 112 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. జాబ్‌మేళాకు సుమారు 6497 మంది యువకులు హాజరు కాగా వారిలో సుమారు 3433 మందికి ఉద్యోగ అవకా శం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారు తేలికగా తీసుకోకుండా కష్టపడి పని చేయాని, ఎంపిక కాని వారు నిరాశ చెందవద్దన్నారు. యువత చెడు మార్గాలకు, సంఘ విద్రోహ శక్తులుగా తయారు కాకుండా ఇలాంటి జాబ్‌మేళా ద్వారా యువతకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, ఏఎస్పీ మౌ నిక, డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, రాజశేఖరరాజు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, జాబ్ కోఆర్డినేటర్ రవి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో ఉద్యోగం పొందిన యువతికి నియామకపత్రం అందజేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ



జాబ్‌మేళాకు హాజరైన యువకులు

ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది



జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో రూ.45వేల ప్యాకేజీతో ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తక్కువ వేతనంతో పని చేస్తున్నా. ఇద్దరు పిల్లలను చదివిస్తూ కుటుంబం నడవడం కొంత ఇబ్బందిగానే ఉంది. కానీ హైదరాబాద్‌లో ఓ కేర్ సెంటర్ సర్వీస్‌లో ఉద్యోగం సాధించడంతో పాటు నెలకు రూ.45 వేల వేతనం లభించడం మరిచిపోలేనిది.

- ఉప్పుల విజయశ్రీ, హనుమాన్‌నగర్, నల్లగొండ

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మర్రిగూడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 6న ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ బాలెం నర్సింహ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాసంగిలో వరి పంట వేసిన రైతులు ధాన్యం కొనుగోలు కోసం శివన్నగూడ వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్నాలు వేసిన రైతులకు రూ.500బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు, కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పంచామృత అభిషేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దోసపాటి ప్రసాద్, రమేష్, కొండల్‌రెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

నవమి వేడుకలకు సర్వంసిద్ధం



శ్రీరామనవమి వేడుకలకు సిద్ధమైన నల్లగొండ రామగిరిలోని రామాలయం

● ముస్తాబైన ఆలయాలు

నల్లగొండ కల్చరల్, మునుగోడు, గట్టుప్పల్, చిట్యాలరూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రామగిరి శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం ముస్తాబైంది. సకల ఏర్పాట్లతో ఆలయమంతా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారి కల్యాణవేదికను అన్ని హంగులతో అలంకరించారు. రామాలయం వార్షిక బ్రహోత్సవాలు, శ్రీరామనవమిని పురస్కరించుకొని శనివారం అర్చక పండితులు మంత్రోచ్చారణతో అగ్ని ప్రతిష్ఠాపన, హోమం, ధ్వజారోహణ, బలిహరణ వంటి పూజలు నిర్వహించారు. చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్రం కర్కాటక లగ్నంలో సరిగ్గా అభిజిత్ ముహూర్తంలో త్రేతాయుగంలో శ్రీరాముడు జన్మించడంతో ఆయన జన్మించిన రోజునే శ్రీరామనవమి వేడుకలు జరుగుతాయి. ఆదివారం శ్రీసీతామచంద్రస్వామి కల్యాణ వేడుకలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ప్రతి ఏడు మాదిరిగానే ఈ ఏడాది కూడా శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారి కల్యాణానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు హాజరవుతారు. ఆలయాన్ని ఇప్పటికే వివిధ రంగులతో, విద్యుత్ దీపాలు, ఆలయ ఆవరణలో మొత్తం చలువ పందిళ్లతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. సౌకర్యాలను మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఈవో జె.రామయ్య పర్యవేక్షిస్తున్నారు. 7వ తేదీన గరుడ వాహనసేవ, 8వ తేదీన రథోత్సవ ఊరేగింపు, 9వ తేదీన దోపోత్సవం, ఏకాంత సేవలు, 10వ తేదీన శృంగార డోలోత్సవం వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రతీరోజు రాత్రి సంగీత సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో శ్రీరామనవ మి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అదేవిధంగా పట్టణంలో వీటీ కాలనీలో గల వేంకటేశ్వరస్వామి దేవాలయం, షేర్‌బంగ్లాలోని సంతోషిమాత ఆల యం, తులసీనగర్‌లో భక్తాంజనేయస్వామి దేవాలయం, పానగల్లులోని వేం కటేశ్వర ఆలయం, మిర్యాలగూడ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయం లో శ్రీరామనవమి వేడుకలు సర్వం సిద్ధం చేశారు. మునుగోడు మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలను అలంకరించారు. గట్టుప్పల్ మండల కేం ద్రంలోని స్వయంభుగా వెలసిన పిల్లిగుండ్ల సీతారామచంద్ర భగవాన్ దేవాలయంలో కల్యాణం నిర్వహించనున్నారు. చిట్యాల మండలంలోని పలు దేవాలయాల్లో శ్రీరామచంద్రస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు.

ఘనంగా స్వామివారి ఎదుర్కోళ్లు

శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి ఎదుర్కోళ్ల మహోత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో స్వామి, అమ్మవార్ల ఆసీనులను చేసి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజలు చేసి ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి, అమ్మవారి గుణ, గణాలను, అందచందాలను, కట్న, కానుకలు వంటి అంశాలను అర్చక స్వాములు వేర్వేరుగా ఛలోక్తిగా సంభాషించారు. ఈ వేడుకలను భక్తులు, ప్రముఖులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ఈవో జయరామయ్య, అర్చక స్వాములు తదితరులు పాల్గొన్నారు.



రామగిరి రామాయలంలో ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బంగారు ఆభరణాలపై రుణాలు

జామ్లానాయక్, మేనేజర్, శాలిగౌరారం



ఇంటర్వ్యూ Interview

భూమి ఉన్న ప్రతీ రైతుకు క్రాఫ్ రుణాలు, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామని తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్యాంక్ మేనేజర్ ముడావత్ జామ్లానాయక్ తెలిపారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. (శాలిగౌరారం,ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: శాలిగౌరారం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఎంత మంది ఖాతాదారులు ఉన్నారు?

మేనేజర్: తమ బ్యాంకులో 14,800 మంది ఖాతాదారులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: క్రాఫ్ లోన్లు ఎంత మంది రైతులకు ఎన్ని కోట్లు ఇచ్చారు?

మేనేజర్: తమ బ్యాంకు పరిధిలో 2400 మంది రైతులకు గాను రూ.25కోట్ల రూపాయల క్రాఫ్ లోన్లు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: ఎంతమంది రైతులకు రెండు లక్షల రుణమాఫీ జరిగింది?

మేనేజర్: 1369 రైతులకు రెండు లక్షల రుణమాఫీ జరిగింది. కొంతమందికి రెండు లక్షలు దాటిన వారికి జరిగింది. అయితే బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మారినందున పెండింగ్‌లో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: బంగారు ఆభరణాలపై గోల్డ్‌లోన్‌లు ఇస్తున్నారా?

మేనేజర్: బంగారు ఆభరణాలపై లోన్లు ఇస్తున్నాం. ఇప్పటి వరకు రూ.6.20కోట్లు రుణాలు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: సమభావన మహిళా సంఘాల గ్రూపులకు లోన్లు ఇస్తున్నారా?

మేనేజర్: తమ బ్యాంకు పరిధిలో 150 సమభావన మహిళా సంఘాల గ్రూపులకు రూ.7 కోట్లకు పైగా లోన్లు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: మీ బ్యాంకు ఖాతాదారులకు ఇంకా ఏమైనా సూచనలు సలహాలు ఇస్తారా?

మేనేజర్: గతంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకుగా ఉండేదని 2025 జనవరి నెల నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పేరు మారిందని ఖాతాదారులు పాత ఖాతా పుస్తకాలను బ్యాంకులో ఇచ్చి కొత్త ఖాతా పుస్తకాలను తీసుకోవాలి. బ్యాంకులో తీసుకున్న అన్ని రకాల రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి పాటు పడాలి.

నిలిచిన ధాన్యం బస్తాలు

● మిల్లుల వద్ద దిగుమతి కాని లారీలు

● ఆందోళనలో రైతులు



తిప్పర్తి మార్కెట్‌యార్డులో లోడ్ చేయని బస్తాలు

తిప్పర్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తాలు ధాన్యం సమస్యతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. శుక్ర, శనివారాల్లో కాంటా వేసిన ధాన్యం సుమారు 3 వేల క్వింటాళ్లు మార్కెట్‌లోనే నిలిచిపోయాయి. రెండు రోజుల క్రితం మార్కెట్ నుంచి వెళ్లిన లారీలు దిగుమతి కాక మిల్లుల వద్దే నిలిచిపోవడంతో లారీ యజమానులు లోడ్ చేసుకోమని చెప్పి నిరసన తెలిపారు. ధాన్యం మాయిశ్చర్ వచ్చినా తాలు పేరుతో మిల్లర్లు దిగుమతి చేసుకోవడం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. కాగా ఇద్దరు రైతుల ధాన్యం బాగోలేదని చెప్పి మంచిగా ఉన్న రైతుల ధాన్యం కూడా తీసుకోకుండా ఆపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వచ్చే అకాల వర్షాలతో ధాన్యం నింపి ఉన్న బస్తాలు సైతం ఎప్పుడు తడుస్తాయోనని భయంగా ఉందని అన్నారు. అధికారులు కలుగజేసుకొని మిల్లర్లతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

టీచర్ల బాధ్యతలపై దృష్టి సారించాలి

● మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



గ్రూప్ 1లో ర్యాంకు సాధించిన వారిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నల్లగొండరూరల్, నల్లగొండటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు తమ హక్కుల కంటే బాధ్యతల నిర్వహణపై ఎక్కువ దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కాలంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సంఖ్య సుమారు 8 లక్షల మంది విద్యార్థుల సంఖ్య విద్యార్థుల తగ్గిందని అన్నారు. ప్రభుత్వ విద్య మెరుగు పరిచేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ బాబుజగ్జీవన్‌రామ్ సామాజిక న్యాయం కోసం, సమాజాభివృద్ధికి, దేశ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన వారి తల్లిదండ్రులను, ర్యాంకు సాధించిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, నాయకులు ఎడ్ల సైదులు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సత్యంను కలిసిన మాజీ సర్పంచ్‌లు

నాంపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యంను నాంపల్లి మండలానికి చెందిన మాజీ సర్పంచులు జిల్లా సీపీఐ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తమ గ్రామాలకు నిధులు కేటాయించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చిట్టెంపాడు, బండ తిమ్మాపురం మాజీ సర్పంచులు అబ్బనబోయిన చందుయాదవ్, రేవెల్లి సుధాకర్ ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు

మునుగోడురూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తాము చదివిన పాఠశాలను తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను మరువవద్దని విశ్రాంత ఎంఈవో చంద్రారెడ్డి పేర్కొన్నారు. పలివెల జడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన 2002-2003 పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి నాటి ఉపాధ్యాయులు కుమారస్వామి, ఎల్లయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయ్‌శ్రీ, సుప్రియ, నర్సింగరావు, సత్తయ్య, సబిత ఉపాధ్యాయులతో కలిసి ఆయన పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తొలి అడుగులు నేర్పింది. అలాంటి పాఠశాలను విద్యార్థులు మరువకుండా విద్యార్థులు తమ అనుభవాలను పంచుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయ సన్మానించి వారికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు



పాదపూజలో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యార్థులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య అన్నారు. తల్లిదండ్రులను గౌరవించే సంస్కారాన్ని పిల్లలకు నేర్పిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం కృష్ణవేణి హైస్కూల్ యాజమాన్యం శుక్రవారం రాత్రి నిర్వహించిన తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమానికి వనజీవి రామయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, సంస్కారాన్ని నేర్పించాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మట్ట చెన్నయ్య, రమేష్ గురూజీ, యానాల ప్రభాకర్‌రెడ్డి, కోడి శ్రీనివాసులు, సుదర్శన్, వెంకటేష్, పాఠశాల చైర్మన్ మట్ట సబిత, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



మునుగోడులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

బాబూజగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, దళితసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అంటరానితనాన్ని రూపుమాపడానికి, దురాగతాలను ఎదుర్కొంటున్న దళిత కులాలను జనజీవన స్రవంతిలో భాగస్వాములను చేయడానికి దీక్షబూనిన గొప్ప సామాజిక ఉద్యమనేత అన్నారు. సామాజిక సమానత్వం కోసం జీవితకాలం పోరాడారని, దేశాభివృద్ధికి బాబుజగ్జీవన్‌రామ్ ఎంతో సేవ చేశారని ఆయన సేవలు మరువలే నివని కొనియాడారు.

మునుగోడులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం హర్షిత్‌రెడ్డి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. అన్నెపర్తిలోని బెటాలియన్‌లో 12వ బెటాలియన్ కమాండెంట్ వీరయ్య నివాళులర్పించారు. నకిరేకల్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, ఆయా పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాలిగౌరారంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా కో ఆర్డినేటర్ బోడ సునీల్‌మాదిగ, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లో వివిధ పార్టీల నాయకులు జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు. నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ బొర్ర సుధాకర్, దళిత సంఘాల నాయకులు కత్తుల జగన్‌కు, పెరిక సంహితా రాణి, దున్న యాదగిరి, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మామిడి సైదులు, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు లంకపల్లి నగేష్, రమణ, బాకీ యాదయ్య, బాషపాక చంద్రశేఖర్, గట్టు మల్లయ్య, వెంకన్న, చింత యాదగిరి, అంజయ్య, శ్రీశైలం, రఘుపతి, శేఖర్ పాల్గొన్నారు.



నకిరేకల్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మునుగోడు పట్టణంలోని తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో శనివారం మిషన్‌భగీరథ, నీటి పారుదల శాఖల అధికారులతో వేర్వేరుగా ఆయన సమీక్షా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య నెలకొనకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన ప్రకారం కాకుండా ఎక్కువగా నీటి సరఫరాకు ప్రణాళికలు రూపొందించాన్నారు. తద్వారా భవిష్యత్తులో నీటి సమస్యలు ఉండవని తెలిపారు. మిషన్‌భగీరథ నీటిని గ్రామాల్లో ప్రతి ఇంటికి నేరుగా సరఫరా చేయాలన్నారు. గత ప్రభుత్వం తాగునీటిని బోరు నీటి ట్యాంకుల్లో కలిపేవిధంగా సరఫరా చేసి విలువైన మిషన్ భగీరథ నీటిని కలుషితం చేసినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అలాంటి తప్పులను ఆస్కారం లేకుండా ప్రత్యేకంగా నీటి సరఫరాకు కృషి చేయాలన్నారు. వర్షం నీటిని ఒడిసి పట్టుకునేందుకు అవసరమైన ఫీడర్ ఛానళ్లను నిర్మాణాలకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. అవసరమైన చోట పక్కాగా నీటి నిల్వకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే అధికారులు 193 రకాల పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపినట్లు తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, యాదాద్రి, భువనగిరి, నల్గొండ జిల్లాల మిషన్ భగీరథ, నీటి పారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఇటీవల జరిగిన జాతీయ పుట్‌బాల్ క్రీడలో అండర్ 14 విభాగంలో మర్రిగూడకు చెందిన సెయింట్ మేరీ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారిని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఆకాక్షించారు.

రైతులపై ప్రభుత్వానిది నిర్లక్ష్య ధోరణి : బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్, వర్షిత్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రైతులపై ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రధానమంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ పథకం రాష్ట్ర కన్వీనర్, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విమర్శించారు. మునుగోడులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఈ ఏడాది తీవ్ర కరవు కారణంగా పంటలు పూర్తిగా ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన పంట పంట విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటం శోచనీయమన్నారు. ఎన్నికల హామీలను అమలుచేయటంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ పథకం పూర్తి స్థాయిలో అమలుచేయకపోవటంపై మండిపడ్డారు. సన్నబియ్యం పథకంలో కేంద్రప్రభుత్వం వాటా 90శాతం ఉందని, కేవలం 10శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేసే ప్రచారం సొమ్ము ఒక్కరిది అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన వక్ఫ్ బోర్డు బిల్లు వల్ల దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని, ప్రధానంగా పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందనున్నాయని తెలిపారు. బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందనుందని ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్, నాయకులు అశోక్ గౌడ్, వేణుకుమార్, నరేందర్‌గౌడ్, లింగస్వామి పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామంలో ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్ సైదులు ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలకు అర్హులైన 500మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

● ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీ నేతలు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లు మంత్రిగా ఉన్న జగదీష్‌రెడ్డి జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టును పూర్తి చేసుకొని ప్రారంభించడం జరిగిందన్నారు. మిగతా ప్రాజెక్టులను పూర్తి చేయడం కోసం తగిన నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా తాము మోసపూరిత మాటలు చెప్పమని, చెప్పినవి ఖచ్చితంగా అమలు చేస్తామని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుల మాటలు ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ దేశానికి ఆదర్శం

మునుగోడు రూరల్, ఏ ప్రిల్5 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పథకం దేశానికి ఆదర్శనీయమని కొంపల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ వెది ర విజయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామంలో శనివారం రేషన్‌షాపులో సన్నబి య్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో డైరెక్టర్ మాదరగోని యాదయ్య, మక్కెన అప్పారావు, యాదయ్య, లింగయ్య, వెంకటయ్య నర్సింహ, మనోజ్ పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని దర్వేశిపురం గ్రామంలోని రేషన్‌షాపులో లబ్ధిదారులకు ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, మాజీ చైర్మన్ దేప కరుణాకర్‌రెడ్డి సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. పేదల కడుపు నింపేందుకే ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కంచకుంట్ల చిన్న, అంజయ్య, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు డేవిడ్‌కుమార్

నకిరేకల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.డేవిడ్‌కుమార్, బహుజన కమ్యునిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు గాజుల శ్రీనివాస్ డి మాండ్ చేశారు. నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బీజేపీకి చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై ఎడతెగని విధంగా హత్యాకాండకు తెగబడుతున్నారని ఆరోపించారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ల పేరుతో వందలాది మందిని హతమార్చడం సరైందికాదన్నారు. సమావేశంలో జనశక్తి రాష్ట్ర నాయకుడు బొమ్మకంటి కొమురయ్య, బహుజన మహాసభ జిల్లా కన్వీనర్ చెడిపల్లి కాశీరాం, అంబటి చిరంజీవి, పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాగ ర్, పజ్జూరు ఉపేంద్ర, వెంకన్న, పల్లెబోయిన జాని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

శాలిగౌరారం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శాలిగౌరారం మండలానికి చెందిన 25మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.10.68లక్షల చెక్కులను ఎమ్మెల్యే సామేలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం ముందంజలో ఉందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్, నాయకులు భూపతి వెంకన్న, బోడ విజయ్, శానాల యుగంధర్‌రెడ్డి, నోముల రవికుమార్, భూపతి శ్రీనివాస్, అంజయ్య, అన్నెబోయిన రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంపై వినూత్న ప్రచారం

కట్టంగూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): యువత మేలుకో.. డ్రగ్స్ మానుకో... భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ ఉపాధ్యాయుడు కరపత్రాలతో శనివారం కట్టంగూరు కేంద్రంలో వినూత్న ప్రచారం చేపట్టారు. మండలంలోని మద్దిరాల మండలం గోరెట్ల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ పాఠశాలకు సెలవు వచ్చినప్పుడల్లా గ్రామాల్లో జరిగే జాతరలు, సంతలకు వెళ్లి డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై కరపత్రాలతో యువతకు అవగాహన కల్పిస్తున్నారు. కట్టంగూరులో శనివారం ఆయన వారాంతపు కూరగాయల సంతలో వినూత్న ప్రచారం చేపట్టారు. యువత మద్యం, డ్రగ్స్ బారిన పడటం వలన పెడదారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.152	225	255
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 23.4



నేడు రాములోరి కల్యాణం


ముస్తాబైన ఆలయాలు

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హిందువుల ఆరాధ్య దైవం సీతారాముడి కల్యాణోత్సవానికి జిల్లా ముస్తాబైంది. జిల్లాలోని అన్ని ఆలయాలల్లో ఆదివారం శ్రీరామనవమిని వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించి చలువ పందిళ్లు వేశారు. కల్యాణ వేడుకల అనంతరం అన్నదానం నిర్వహించనున్నారు. సాయంత్రం కల్యాణమూర్తులను ఊరేగించనున్నారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రం రామగిరి రామాలయంలో శ్రీరామనవమి వేడుకలకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సుగుణాభి రాముడు

- కుమారుడు, భర్త, అన్నగా నేటి తరానికి ఆదర్శం
- బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచిన పాలనాదక్షుడు ,ఏకపత్నీవ్రతుడు

•6లో..



మిర్యాలగూడలో రైస్ మిల్లుల ఎదుట బారులుతీరిన ధాన్యం ట్రాక్టర్లు

మిల్లర్ల మాయాజాలం

యాసంగిలో పండిన పంటకు మంచి ధర పలుకుతుందని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. ధాన్యం రాక పెరగడంతో మిల్లర్లు కనీస మద్దతుకు మంగళం పలికారు. ఇష్టం వచ్చిన ధర కు మిల్లర్లు కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధర అమాంతం తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వానాకాలంలో మిల్లర్లు చింట్లు, హెచ్‌ఎంటీలు, సన్న రకాలకు పచ్చిధాన్యానికి రూ.2,500 నుంచి రూ.2,800 వరకు కొనుగోలుచేశారు. యాసంగిలో క్వింటాకు రూ.2వేలు నుంచి రూ.2,250 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,హుజూర్‌నగర్,మిర్యాలగూడ వ్యవసాయం

- యాసంగిలో దిగుబడి పెరిగినా ధర తగ్గింది
- చింట్లు రకం కొనుగోలు, హెచ్‌ఎంటీలకు నో
- ఇదే అదునుగా ధర తగ్గించిన మిల్లర్లు
- తెరుచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- క్వింటాకు రూ.2వేల నుంచి రూ.2,250 చెల్లింపు
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు

యాసంగిలో సాగర్ ఆయకట్టులో సుమారు 6.50లక్షల ఎకరాల్లో వరి సాగైంది. వీటిలో 80శాతం మేర చింట్లు, హెచ్‌ఎంటీ వంటి అతి సన్న రకాలను సాగు చేశారు. ఐదేళ్లగా వరుసగా వానాకాలం, యాసంగిలో ఈ రకం సన్నాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వరి కోతల ప్రారంభ దశలో క్వింటాకు రూ.2,500 నుంచి రూ.2,700 వరకు ధర పలుకుతూ వచ్చింది. ప్రతీ సారి మద్దతుకు మించి ధర వస్తుండటంతో యాసంగిలో రైతులు సన్నాలను అధికంగా సాగు చేశారు. ఈఏడాది యాసంగిలో మార్చి 10నుంచే వరికోతలు ప్రారంభం కాగా, ప్రారంభంలో చింట్లు రకానికి రూ.2,400, హెచ్‌ఎంటీలకు రూ.2,250 చెల్లించిన వ్యాపారులు ప్రస్తుతం ధర తగ్గించారు. మిల్లులో భారీగా ధాన్యం నిల్వ ఉందని మిల్లర్లు కొనుగోలుకు ముందుకు రావడం లేదు.మద్దతు ధర రూ.2,320 కాగా, కేవలం చింట్లు రకానికి రూ.2,250 చెల్లిస్తున్నారు. హెచ్‌ఎంటీ రకాలను కొనుగోలు చేసే దిక్కు లేదు. మిర్యాలగూడ ప్రాంతంలో 150వరకు మిల్లులు ఉండగా, పదికి మించి మిల్లులు హెచ్‌ఎంటీ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. సన్నాల్లో అధికంగా హెచ్‌ఎంటీ రకాలనే సాగు చేశా రు.ఒక ట్రాక్టర్ ధాన్యం విక్రయించేందుకు రెండు రోజు ల వరకు సమయం పడుతోందని రైతులు చెబుతున్నారు. అదికూడా క్వింటాకు రూ.2,000నుంచి రూ.2,1 00వరకు ధర చెల్లిస్తున్నారని, విధిలేని పరిస్థితుల్లో విక్రయించక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లర్ల సిండికేట్

సూర్యాపేట జిల్లా పరిధిలోని హుజూర్‌నగర్, కోదాడతో పాటు సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కోతలు ముమ్మరమయ్యాయి. వారం రోజుల నుంచి రైతులు పచ్చి ధాన్యాన్ని తీసుకువస్తుండగా, మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ఆయకట్టులోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో సుమారు 2.5లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఒక్క...

- మిగతా 7వ పేజీలో...

మిల్లర్లు యాసంగి ధర తగ్గించారు



మిల్లర్లు యాసంగిలో రైతులు ధర పూర్తిగా తగ్గించారు. పచ్చి ధాన్యాన్ని గత యాసంగిలో రూ.2,700 వరకు కొనుగోలు చేయగా, ఈ ఏడాది రూ.2,000లకే కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ.700 ధర తగ్గింది. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

- గుండు వెంకటేశ్వర్లు, హుజూర్‌నగర్ రైతు

తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు

యాసంగిలో సాగర్ ఆయకట్టులో పదిరోజుల నుంచే వరి నూర్పిడి చేస్తుండగా, సూర్యాపేట జిల్లాలో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. రెండు రోజుల క్రితం జిల్లా ఉన్నతాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 127, ఐకేపీ ఆధ్వర్యంలో 137, మొత్తం 286 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ, నేటికీ అవి తెరుచుకోలేదు. రెండు రోజులుగా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురవగా, ఆకాశంలో మబ్బులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చేసేది లేక పచ్చిధాన్యాన్ని తక్కువ ధరకే మిల్లర్లకు విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- మాజీ సీఎం కేసీఆర్
- ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలతో సమీక్ష



ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

నల్లగొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నేతలంతా కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కోరారు. శనివారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల బీఆర్ఎస్ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ విజయవంతంపై నేతలకు ఆయనపలు సూచనలు చేశారు. రజతోత్సవానికి పెద్ద సంఖ్యలో జనాన్ని తరలించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ముందస్తు గా నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశాలు నిర్వహించాలన్నారు. మండలాలు, గ్రామాలవారీగా ఎక్కడి నుంచి ఎంతమందిని సభకు తీసుకురావాలో నిర్ణయించుకోవాలని సూచించారు. సూర్యాపేట, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల నుంచి 10వేల మంది చొప్పున జనసమీకరణ చేయాలన్నారు. మిగిలిని నియోజకవర్గాల్లో 4వేల నుంచి 5వేల వరకు జన సమీకరణ చేయాలన్నారు. బస్సులు, ఇతర వాహనాలను ముందుగానే...

- మిగతా 6వ పేజీలో...

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఎల్లారెడ్డిగూడెంలో మేడి అరుణ ఇంట్లో ఎమ్మెల్యే వీరేశంతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయంలో హరిత విప్లవానికి జగ్జీవన్‌రామ్ కృషి చేశారన్నారు. నేడు దేశంలో ఎగుమతులు ఉచ్చస్థాయిలో ఉన్నాయంటే దానికి ఆయనే కారణమన్నారు. ఆయన కూతురు మీరాకుమార్ లోక సభ స్పీకర్‌గా ఉండగా, తెలంగాణ బిల్లును పాస్ చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. జిల్లాలో అభివృద్ధిలో భాగంగా ఈనెల 7న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాన్ని ప్రారంభించనున్నామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ మరమ్మతుకు రూ.25లక్షలు జిల్లా మినరల్ ఫండ్ నుంచి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్యే నిధుల నుంచి మరికొంత సమకూరుస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని దళిత యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ స్టడీ సెంటర్ ఏర్పాటు చేస్తామని, వన్‌టౌన్‌లో ఉన్న లైబ్రరీ స్థానంలో మోడల్ లైబ్రరీని కడతామని, ఎస్ఎల్‌బీసీ వద్ద 25 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అందుకు ప్రభుత్వం రూ.30కోట్లను ఇదివరకే మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్, చక్రహరి రామరాజు, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, దున్న యాదగిరి, సుధాకర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు.

అరుణ చేతి వంట ఇంటి భోజనాన్ని తలపించింది

(ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి):సన్న బియ్యంతో అరుణ చేసిన వంట ఇంటి భోజనాన్ని తలపించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సన్నబియ్యం పథకంతో పేదల్లో కనపడుతున్న సంతోషం చూస్తే నిజమైన తెలంగాణ ఆవిష్కృతమైన సంబరం కలుగుతోందన్నారు. శనివారం నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం దళిత కాలనీలో రేషన్‌కార్డు లబ్ధిదారురాలు మేడి అరుణ ఇంట్లో సన్నబియ్యం భోజనాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సన్నబియ్యం పథకం పేదవాడి ఆత్మగౌరవ పథకమన్నారు. సంపన్నులు తినే సన్నబియ్యం పేద దళితులకు అందించిన చరిత్ర దేశంలో ఒక్క తెలంగాణకే దక్కిందన్నారు. తమది దొరల కుటుంబం కాదని, మధ్య తరగతి రైతు కుటుంబమేనన్నారు. దళితుల ఇంట్లో కింద కూర్చుని తింటుంటే తాను కూడా చిన్నపుడు ఇలాగే కింద కూర్చుని తిన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అరుణకు స్థలం ఉంటే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామని, స్థలం లేకుండే ఇంటి స్థలం, ఇంటిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, జెరిపోతుల భరత్, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రేగట్టి సతీశ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్యసేవలు

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా పేదప్రజలకు కార్పొరేట్ ఉచిత వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రూ.23.75కోట్లతో నిర్మించిన క్రిటికల్‌కేర్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే రూ.22కోట్ల ఎల్‌వోసీలకు ఇచ్చామన్నారు. ఉదయం ఎల్‌వోసీకి దరఖాస్తు చేసుకుంటే సాయంత్రంలోగా ఇస్తున్నామన్నారు. గాంధీ, నీలోఫర్ తర్వాత నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఎక్కువ ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌కు అవసరమైన లిఫ్టు, వెంటిలేటర్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచిందని,అంబులెన్స్ సౌకర్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ జైపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

సమాఖ్య భావనను కాపాడుకోవాలి

రాజ్యాంగం ప్రకారం భారత్ యూనియనే

వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్



డీటీఎఫ్ విద్యాసదస్సులో మాట్లాడుతున్న వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్

మిర్యాలగూడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రకారం భారత యూనియన్‌గా పిలవబడిందని, సమాఖ్య భావనను కాపాడుకోవాల్సి బాధ్యత పౌరులపై ఉందని వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ అన్నారు. శనివారం మిర్యాలగూడలో డీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యాయురాలు కె. ప్రమీల పదవీ విరమణ సందర్భంగా డీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసదస్సు నిర్వహించారు. 'సమాఖ్య విధానం విచ్ఛిత్తి-కేంద్రం దూకుడు' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ చివరి వైస్రాయ్ మౌంట్‌బాటన్ భారత్ దేశం కాదని, ఖండం అని వ్యాఖ్యానించారని అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఏకీకరణ సందర్భంలో 560 సంస్థానాలను విలీనం చేశారన్నారు. 1965 నుంచే సమాఖ్య భావనకు కేంద్ర పాలకులు తూట్లు పొడుస్తూ వచ్చారని అన్నారు. 1967లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి రాష్ట్రాల హక్కులను కాలరాశారన్నారు. జీఎస్‌టీ, సెస్ లాంటి పన్నుల ద్వారా దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 30శాతం నిధులు చెల్లిస్తుండగా, అందులో 18 శాతమే కేంద్రం రాష్ట్రాలకు నిధులు విడుదల చేస్తోందన్నారు. సదస్సులో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, కార్యదర్శి భాస్కర్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారావు, లింగయ్య, యోగానందం, భిక్షమయ్య, రామయ్య, వెంకన్న, ప్రభాకర్, దుర్గయ్య, ఉదయ తదితరులు పాల్గొన్నారు.

• జాబ్ మేళాకు విశేష స్పందన



జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ పోలీస్‌పరేడ్ మైదానంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మేళాకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పలు కంపెనీల ఉద్యోగాలకు ఎంపికైన యువకులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నియామక పత్రాలు అందజేశారు. •7లో..

అడుగంటిన శాలిగౌరారం ప్రాజెక్టు

ఎండుతున్న చివరి పొలాలు



అడుగంటుతున్న శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మొదలే మండుతున్న ఎండలు. ఆపై అక్రమ నీటి వినియోగంతో జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిగా అడుగంటుతుంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి అక్రమ నీటి వినియోగంతో ప్రాజెక్టు నీటిమట్టం బాగా పడిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం బాగా పడిపోయింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 21 అడుగులకు గాను ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరింది. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు నీరందక నిలువునా ఎండి పోతున్నాయి. గత జూలైలో పూర్తిగా నిండిన ప్రాజెక్టు రెండు పంటలకు రైతులు ప్రధాన కాలువలకు విద్యుత్ మోటార్లతో లిఫ్టింగ్ ఏర్పాటు చేసి అక్రమ నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. దీంతో ప్రాజెక్టు ఆయకట్టులో స్థిరీకరించిన భూములకు నీటి పారుదల సక్రమంగా కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చివరి భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చివరి భూముల రైతులు రాత్రింబవళ్లు తమ పంటలను కాపాడుకోవడానికి కాలువల చుట్టూ నీటికోసం అష్టకష్టాలు పడుతున్నారు.

ధాన్యాన్ని తక్కువ ధర చెల్లిస్తే చర్యలు

సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్



మిల్లర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటే చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మిల్లర్లు, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,300కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఎంటీ వెరైటీ రకం వడ్లను కూడా కొనుగోలు చేయాలన్నారు. తూకంలో మోసం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, మోసాలకు పాల్పడితే అలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. రైసుమిల్లుల ముందు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మిల్లు యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిల్లు సామర్థ్యం లేకుంటే పక్క మిల్లుకు పంపేవిధంగా చూడాలన్నారు. కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్ ప్రకారం ప్రతీ మిల్లర్ వారి సామర్థ్యంలో 50 శాతం కొనుగోలు చేయాలన్నారు. వేసవిలో రైతుల దాహార్తిని తీర్చేందుకు మిల్లులో మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ,సివిల్‌సప్లయ్ అధికారులు అన్నిరూట్లలో మిల్లుల వద్ద పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో మిలర్స్ అసోసియేషన్ నాయకులు గౌరు శ్రీనివాస్, కర్నాటి రమేష్, బాబ్జి, కుశలయ్య, తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐలు, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

యాదవసంఘం దేవరకొండ మండలాధ్యక్షుడిగా యాదయ్య

దేవరకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం దేవరకొండ మండలాధ్యక్షుడిగా కాసారం గ్రామానికి చెందిన నోముల యాదయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తన ఎంపికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడికి, మాజీ ఎంపీపీ జాన్‌యాదవ్‌కు యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేములపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన రమావత్ లక్ష్మణ్, లీలా దంపతులు ఆటోలో శెట్టిపాలెం గ్రామం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఆటోలోని 4.5 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

● సుజాత, ఎంపీడీవో, చింతపల్లి



ఇంటర్వ్యూ Interview

వేసవిలో మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చింతపల్లి ఎంపీడీవో సుజాత తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో నీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు ఆమె వెల్లడించారు.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

ఆంధ్రజ్యోతి: మండలంలోని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

ఎంపీడీవో : ఇప్పటికే మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్య దర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశాం. ముందస్తు ప్రణాళికలు రూపొందించి తగిన చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: పారిశుధ్య సమస్య గ్రామాల్లో తీవ్రంగా ఉంది. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఎంపీడీవో: పారిశుధ్య సమస్య తలెత్తకుండా కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు అందించాం. మురుగునీరు తలెత్తకుండా సిబ్బందితో శుభ్రం చేయించుటకు ఆదేశాలు జారీ చేశా.

ఆంధ్రజ్యోతి : నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

ఎంపీడీవో: మండలంలో మొత్తం 34 గ్రామపంచాయతీలకు అన్ని పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. చెట్లు ఎండిపోకుండా నీరు పోసేందుకుకార్యదర్శులకు తగిన సూచనలు చేశాం. మండలంలో 1,15,200 లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యం. మొక్కలు ఎండిపోతే మళ్లీ విత్తనాలు వేసి పెంచుతున్నాం.

మాడ్గులపల్లి రైల్వే స్టేషన్ ఏదీ!

● కోల్పోయిన ఆనవాళ్లు



ఆనవాళ్లు కోల్పోయిన మాడ్గులపల్లి రైల్వేస్టేషన్

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ): మాడ్గులపల్లి వద్ద గతంలో నిర్మించిన రైల్వే స్టేషన్ ఆనవాళ్లు కోల్పోయింది. రైల్వేస్టేషన్ గోడలు, పైకప్పు రేకులు ధ్వంసమై మట్టిలో కలిసిపోయాయి. కుక్కడం రైల్వే స్టేషన్ వద్ద రైల్వే క్వార్టర్స్ కూడా నిర్మించినప్పటికీ ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. తొలుత రైల్వేలైన్ ప్రారంభంలో రైల్వే ట్రాక్ పరిసర పెద్ద గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో మిర్యాలగూడ డివిజన్ పరిధిలో కుక్కడం, మాడ్గులపల్లిలో రైల్వేస్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. 1990 వరకు రేపల్లె రైలు అన్ని స్టేషన్లలో నిలపడంతో కొందరు విద్యార్థులు రోజూ రైళ్లో చదువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి చేసినప్పటికీ ఊరుకు దూరంగా సుమారు 2 కి.మీ దూరం ఉండటం, రైల్వేస్టేషన్‌కు వెళ్లి వచ్చేవారని అంటున్నారు. మార్గంలో విద్యుత్ లైట్లు లేకపోవడం, స్టేషన్‌కు వెళ్లడానికి సరైనా రవాణా సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రయాణికులు రాక స్టేషన్లు నిరుపయోగంగా మారినట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రవాణా సదుపాయాలు పెరిగినందున డివిజన్‌లోని రైల్వే స్టేషన్లను పునరుద్ధరించి లోకల్ ట్రైన్లు స్టేషన్లలో నిలిపే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించాలి



మాడ్గులపల్లి రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించాలి. గ్రామానికి 1.5 కి.మీ దూరంలో రైల్వే స్టేషన్ ఉండ డం, అక్కడి వరకు సరైన రోడ్డు మార్గం, స్ట్రీట్‌లైట్లు లేనందున ప్రయాణికులు ఎక్కువగా రైల్వే సేవ లను వినియోగించుకోలేక పోయారు. ప్రస్తుం అన్ని విధాలుగా అభివృద్ధి చెందినందున రైల్వే అధికారులు స్టేషన్‌ను పునరుద్ధరించి, రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేసి మాడ్గులపల్లి మండల ప్రజలకు రైల్వే సేవలను అందుబాటులోకి తేవాలి.

- పుల్లెంల శ్రీకర్, మాడ్గులపల్లి

ఈత సరదా కారాదు విషాదం



కొండమల్లేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు వచ్చాయంటే చాలు ఈత కోసం విద్యార్థులు, చిన్నారులు తాపత్రయం పడుతుంటారు. వేసవిలో యువత, చిన్నారులు కాల్వలు, చెరువులు, బావుల్లో స్నానాలు చేసేదుకు ఈత కొట్టేందుకు వెళ్తుంటారు. సరదాగా వేసవి తాపం తీర్చుకోవడానికి వెళ్లి ఆయా సందర్భాల్లో ప్రమాదాల బారిన పడి కుటుంబాలకు తీరని శోకం మిగులుస్తున్నారు. మరో 15 రోజుల్లో పాఠశాలలకు సెలవులు రానున్నాయి. దీంతో ఇంటి వద్ద ఉండలేక సరదాగా ఈతకు, ఇతర ఆటల వైపు విద్యార్థులు స్నేహితులతో కలిసి బయటకు వెళ్తుంటారు. ఈత ప్రతి ఒక్కరికీ అవసరమని గుర్తిస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఈత కొలను వద్ద తీసుకొచ్చి నిర్ణిత జాగ్రత్తలు తీసుకొని వారికి ఈత కొట్టేలా శిక్షణ ఇస్తున్నారు. సరదాగా సమయాన్ని విషాదం కాకుండా చూసుకోవాలని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. కనీస జాగ్రత్తలు పాటిస్తే నీటి గండం నుంచి బయటపడొచ్చు..

పాటించాల్సిన నియమాలు

- బావులు, చెరువుల్లో ఈతకు వెళ్లే చిన్నారులు మొదటగా వాటి లోతు ఎంత ఉందో తెలుసుకోవాలి.
- ఈత నేర్చుకునేవారు తప్పనిసరిగా ట్యూబ్ ధరించాలి.
- తల్లిదండ్రుల ఎవరో ఒకరు తమ పిల్లల వెంట ఉండాలి.
- ఈత కొలనుకు సరైన శిక్షకుడు, రక్షణ చర్యలు ఉన్నాయో లేవో తెలుసుకోవాలి.
- యువత మద్యం తాగి చెరువుల్లో బావుల్లోకి దిగకూడదు.
- చెరువులు, కాలువల్లో దిగే ముందు నీటి ప్రవాహం అధికంగా ఉంటే నీటిలోకి దిగకపోవడమే మంచింది.

పిల్లలకు అవగాహన కల్పించాలి



వేసవి కాలం కావడంతో చిన్నారులు, యువకులు, ఈతకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తారు. ఈ నేపథ్యంలో ఈత కొలనులను నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా షరతులు పాటించాలి. చిన్నారులకు ఈత నేర్పించేటప్పుడు నిర్వాహకులు ఖచ్చితంంగా శిక్షకులను నియమించుకోవాలి,చెరువుల్లో బావుల్లో ఈతకు వెళ్లే చిన్నారులకు జరిగే ప్రమాదాలపై తల్లిదండ్రులు వారి పిల్లలకు అవగాహన కల్పించాలి. చెరువుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉంటే నీళ్లలోకి దిగకూడదు.

- రామ్మూర్తి, ఎస్ఐ, కొండమల్లేపల్లి

రథోత్సవ వార్షికోత్సవాలు ప్రారంభం

చింతపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గొడుకొండ్ల ఆంజనేయస్వామి ఆలయ 14వ రథోత్సవ వార్షికోత్సవాలు శనివారం ఆలయంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాల్లో తొలిరోజు గణపతి పూజ, స్వస్తి పుణ్యహావాచనం, అఖండదీపారాధన, దీక్షబంధన నవగ్రహపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంగిరేకుల గోపాల్, అర్చ కులు మొకిరాల శ్రీకాంత్‌శర్మ, వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, ధర్మకర్తలు ఇడుకుళ్ల రాం మోహన్, కడారి జంగయ్య, వెంకటయ్య, ఉమాయాదయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు అందజేత



తీదేడుకు సీసీ కెమెరాలు అందిస్తున్న కంపెనీ నిర్వాహకులు

చింతపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌కో సోలార్ ప్రైవేట్ కంపెనీ నిర్వాహకులు గ్రామాభివృద్ధికి 8సీసీ కెమెరాలు, పంచాయతీ కార్యాలయానికి కంప్యూటర్, ఫర్నిచర్ తదితర సామగ్రిని శనివారం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి కాయితీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ..గ్రామంలో దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ డైరెక్టర్ రమావత్ హనుమాన్‌నాయక్, దాసరి శ్రీనివాస్ యాదవ్, కొరివి యాదగిరి, సత్తయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డీ ఫారెస్ట్ భూములకు రైతు భరోసా ఇవ్వాలి

చందంపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డీ ఫారెస్ట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతు భరోసా, రైతు రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర నాయకుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నల్లచెలమూల గ్రామంలో డిఫారెస్ట్ భూముల నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ ముంపునకు గురైన ముంపు ప్రాంతాలకు అప్పటి ప్రభుత్వం 1500 ఎకరాలు డిఫారెస్ట్ భూములుగా మార్చి భూనిర్వాసితులకు పాస్‌పుస్తకాలు అందజేసిందని అన్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులు, రాజకీయ దళారులు కలిసి ధరణి పోర్టల్‌లో అక్రమంగా పట్టాలు చేసుకోవడంతో డిఫారెస్ట్ భూముల పట్టాలను రద్దు చేశారన్నారు. దీని వల్ల నిజమైన భూనిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి డీఫారెస్ట్ భూములను అర్హులైన లబ్ధిదారులకు అందజేసి రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భూనిర్వాసితులు ఆంజనేయులు, వెంకటయ్య, పుల్లయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

రావులపెంటలో వైద్య శిబిరం



అవగాహన కల్పిస్తున్న ప్రముఖ వైద్యుడు మువ్వా రామారావు

వేములపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపెంట గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠ శాలలో మిర్యాలగూడ పట్టణానికి చెందిన జ్యోతి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా గుండె, గ్యాస్ట్రో వైద్య శిబి రాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు మువ్వా రామారావు మాట్లాడుతూ మిర్యాలగూడ పరిసర గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు గుండె, గ్యాస్ట్రో సంబంధిత వ్యాధులతగిన అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆదిల్‌బాషా, మువ్వా శ్రీహర్ష, ఎం.వెంకటేష్, జగదీష్‌చంద్రబోస్, ఆసిఫ్, ఖాజా, మాజీ ఎంపీటీసీ శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు తరలిన యువకులు

వేములపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన యువ తేజం మెగా జాబ్ మేళాకు వేములపల్లి మండలం నుంచి సుమారు 150 మంది నిరుద్యోగ యువతీ, యువకులు మూడు బస్సుల్లో తరలివెళ్లినట్లు ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా తమ సిబ్బంది స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి యువతీ, యువకుల నుంచి వివరాలు సేకరించి జాబ్ మేళాకు తరలించామన్నారు.

రైతులకు అన్నదానం

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యతేజ రా అండ్ పార్‌బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం జయిని మురళి ఆధ్వర్యంలో రైతులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సౌకర్యంతోపాటు అన్నదానం కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పైడిమర్రి రంగనాద్, పైడిమర్రి సురేష్, జయిని ప్రకాశ్, సతీష్, శ్రీరాంరెడ్డి, విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

● జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన అధికారులు, నాయకులు



దేవరకొండలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



మిర్యాలగూడలో నివాళులర్పిస్తున్న సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్

దేవరకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ఉప ప్రధాని, సంఘసంస్కర్త దివంగత బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తి దాయకమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, కేంద్ర మంత్రిగా పని చేసి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అలాగే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య, సీపీఐ కార్యాలయంలో పల్లా నర్సింహరెడ్డి, సీపీఎం కార్యాలయంలోకార్యదర్శి నల్ల వెంకటయ్య, బీజేపీ కార్యాలయంలో వస్కుల సుధాకర్, మున్సిపాలిటీలో రాజేష్ బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.ఏ.సి రాజ్‌ఖాన్, జూలూరి ధనలక్ష్మీబాలనారాయణగౌడ్, మారుపాకల అరుణ సురేష్‌గౌడ్, కొర్ర రాంసింగ్, జూలూరి గిరి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ తన కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మునిసి పల్ కార్యాలయంలో కమిషనర్ మహ్మద్ యూసుఫ్, సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గసభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వై జంక్షన్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సామాజిక కార్యకర్త డాక్టర్ జాడి రాజు మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మొండికత్తి లింగయ్య వేర్వేరుగా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వస్కుల మట్టయ్య, తలకొప్పుల సైదులు, మచ్చ సైదులు, గూడపురి శ్రీను, నాగేష్, క్రాంతి, ఈశ్వర్, మోహన్, కార్తిక్, రవీందర్, టీడీపీ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్, తిరుమలగిరి అంజి, ఉపేందర్ నివాళులర్పించారు.

● హాలియా : స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట జగ్జీవన్‌రామ్ విగ్రహానికి హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారా యణగౌడ్, చింతల చంద్రారెడ్డి, వెంపటి శ్రీనివాస్, జూపల్లి శ్రీనివాస్, మజాహార్ మొయినుద్దీన్, పిల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

● నిడమనూరు : మండలకేంద్రంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, ప్రభుత్వ కార్యాలయాల్లో చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, ఏజీపీ ఉన్నం చినవీరయ్య, పోలే డేవిడ్, కొండేటి శ్రీను, విశ్వనాధుల రమేష్, బొల్లం రవి, నల్లబోతు వెంకటేశ్వర్లు, ఆదిముళ్ల భాస్కర్, పుల్లయ్య, పోలె రవి, పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదాసు విక్రం, చంద్రమౌళి నాయక్, నాగార్జున, కోటేశ్వర్ రావు, పాల్గొన్నారు.

● డిండి : మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎస్ఐ బోదాసు రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బొల్లే శైలేజ్, ఏటి కృష్ణ, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, గడ్డమీది సాయి, పోలం లక్ష్మణ్, పాల్గొన్నారు.

● పెద్దవూర : మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో జగ్జీవన్‌రావు చిత్రపటానికి, సెంటర్‌లో ఆయన విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ దండ శ్రీనివాస్ రెడ్డి, జాతీయ విగ్రహాల నిర్మాణ వ్యవస్థాపకులు పులిమాల కృష్ణారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆడెపు నాగార్జున, వీరబోయిన వెంకటయ్య, ఆడెపు రామలింగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● వేములపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాలి కాంతారెడ్డి ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పుట్టల పెదవెంకన్న, కొమ్ము వెంకన్న, తంగెళ్ల సత్తిరెడ్డి, ఎస్‌కె.హాజీ, దేశిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొంగర్ల వినోద్, పగడాల నగేష్, మాతంగి చంటి, వెంకన్న, శ్రీనివాస్, పాల్గొన్నారు.



హాలియాలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళుల్పరిస్తున్న అనుముల మండల కాంగ్రెస్ నాయకులు



మిర్యాలగూడ పట్టణంలోని వై జంక్షన్‌లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

రాములోరి కల్యాణోత్సవానికి ఆలయాలు ముస్తాబు

దేవరకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలకు దేవరకొండ పట్టణంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు శ్రీరామరక్ష హో మం, గణపతి నవగ్రహ శ్రీరామ మూలమంత్ర ఆంజనేయస్వామి మూల మంత్ర హోమం, అనంతరం 12.05 గంటల నిమిషాలకు కల్యాణోత్సవం నిర్వహిం చనున్నట్లు పేర్కొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : మండల కేంద్రంలోని సీతా రామచంద్ర స్వామి ఆలయంలో నేటి కల్యాణోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండపాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. వేడుకకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు హాజరుకానునడంతో ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి తెలిపారు. శని నుంచి సోమవారం వరకు వివిధ రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



దేవరకొండలో ముస్తాబైన కోదండ రామాలయం



తిరుమలగిరి (సాగర్) కోలాట పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

జాతరలు సంస్కృతిని ప్రతిబింబిస్తాయి :ఎమ్మెల్సీ కోటిరెడ్డి

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు సంస్కృతిని ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన రాష్ట్ర స్థాయి మహిళా కోలాట పోటీలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎంతో కాలంగా శ్రీరామనవమి వేడుకలను తిరుమలగిరిలో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. అలాగే కబడ్డీ పోటీలను ఎస్ఐ వీరశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడుశాగం పెద్దిరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ శాగం నాగిరెడ్డి, నాయకులు కాంసాని సాంబశివారెడ్డి, కర్నా నర్సిరెడ్డి, చవ్వా నాసర్‌రెడ్డి, శాగం లింగారెడ్డి, శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఆవుల నాసర్‌రెడ్డి, పగడాల సైదులు, జ్వాలా నరసింహారావు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ

చింతపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లోని రేషన్‌దుకాణాల లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ శ్రేణులు పంపిణీ చేశారు. గొడుకొండ్ల, వెంకటంపేట తక్కళ్లపల్లి, పోలేపల్లి రాంనగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున బియ్యం అంద జేస్తుందని పేర్కొన్నారు. పేదలకు సన్నబియ్యం అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి అంగిరేకుల గోవర్థన్, జితేందర్ రెడ్డి, మాస బా స్కర్, దాసరి శ్రీనివాస్, శేఖర్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

శిరుసనగండ్ల జాతరకు బస్సులు

దేవరకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా చారు కొండ మండలం శిరుసనగండ్లలో జరిగే జాతర, బ్రహ్మోత్సవాలకు దేవరకొండ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఇన్‌చార్జి డిపో మేనేజర్ రాంమోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈనెల 6, 9, 10 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.